



ఆటో నగర్ నుంచి సంతోష్ నగర్ వరకు పర్యటిస్తున్న నాయకులు

నిబంధనలకు విరుద్ధంగా హైవే నిర్మాణం

- రోజు ప్రమాదాలు జరుగుతున్నా స్పందించని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సంతోష్ నగర్ సమీపంలో జాతీయ రహదారి(నేషనల్ హైవే రోడ్డు) ఇంతవరకు అనేకమంది ప్రమాదాల గుర్రై మరణించారు. ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయినప్పటికీ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. హైవే పక్క సర్వీసు రోడ్డు ప్రక్కనే కాలువ ఉన్నందున ఎదురుగా వస్తున్న వాహనాల వెలుతురుకు కనిపించక ద్విచక్ర వాహనదారులు కాలువలో పడుతున్నామని స్థానిక ప్రజలు పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం ఎదుట వాపోయారు. శుక్రవారం స్థానిక ప్రజలతో కలిసి ఆటోనగర్ నుండి సంతోష్ నగర్ వరకు పర్యటించారు. సంతోష్ నగర్ అసోసియేషన్ ప్రతినిధి కె. గోపీనాథ్, సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి, ఆటోనగర్ అసోసియేషన్ ప్రతినిధి కె. రంగస్వామి మాట్లాడుతూ పార్లమెంటు సభ్యుడు, ఆఫీసు సమీపంలో ఉందనే స్పృహ కూడా లేకుండా జాతీయ రహదారుల అధికారులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా సర్వీసు రోడ్డు ఇరుకుగా వేశారని, దీనికి తోడు రోడ్డుకు అడుగున్నర దూరంలోనే కాలువ నిర్మించడం దానిపై స్లాబు వేయాలనే స్పృహ లేకపోవడంతో ప్రతిరోజు స్థానిక ప్రజలు ప్రమాదాలకు గురవుతూనే ఉన్నాయన్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని వెంటనే నిబంధనల ప్రకారం రోడ్డు విస్తీర్ణాన్ని పెంచి ఫుట్‌పాత్ నిర్మించాలని కోరారు. ఆలస్యం చేస్తే జరిగే ప్రమాదాలకు ప్రభుత్వ అధికారులు ప్రజా ప్రతిని దంలే బాధ్యత వహించాల్సింది వస్తుందన్నారు. నాయకులు ఎన్.శ్రీనివాసరెడ్డి, ఎ.వెంకటేశ్వర్లు, ఎన్.మద్దిలేటి, కె.మధుసూదన్, ఎల్.రమణ గౌడు, కె.శ్రీనివాసులు,ఏ విశ్వనాథ్, కె.రామాంజనేయులు పాల్గొన్నారు.

బిజెపి జెండాలతో నిండిన స్టేడియం

- ఎమ్మెల్సీ ఎన్నికల నిబంధనలు గాలికి - పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్

కర్నూలు స్పోర్ట్స్ అథారిటీ ఔట్ డోర్ స్టేడియంలో బిజెపి జండాలు వెలిశాయి. ప్రస్తుతం స్టేడియంలో ఏదైనా కార్యక్రమానికి, క్రీడలకు గాని గ్రౌండ్‌ను వాడుకోవాలంటే కొంత పైకం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ ఆదేశాల ఉన్నాయి. పార్టీల కార్యకలాపాలకు కాకుండా క్రీడలకు నిబంధనలతో కూడిన అనుమతి ఇస్తారు. బుధవారం నుండి బిజెవైఎం కబడ్డి పోటీల నిర్వహణకు ఆంక్షలతో అనుమతి ఇచ్చారు. ఆంక్షలను, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను గాలికి వదిలేసి బిజెపి జెండాలను స్టేడియంలో ఏర్పాటు చేశారు. బిజెపి అనుబంధ సంస్థ అయిన బిజెవైఎం వారు ఏకంగా బిజెపి



స్టేడియంలో పెట్టిన బిజెపి జెండాలు

జండాలు స్టేడియంలో ఏర్పాటు చేసి కబ్బడి పోటీలను పార్టీ కార్యక్రమంగా నిర్వహించిస్తున్నారు. స్టేడియం సిబ్బంది జండాలు తీయమని హెచ్చరించినా పట్టించుకోలేదని తెలిసింది. రాజకీయ పార్టీ కార్యక్రమాలు ఆట ప్రాంగణంలో నిర్వహించరాదనే నిబంధనలకు విరుదంగా నిర్వహిస్తున్నారు. పైగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్న క్రమంలో నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. స్టేడియంలో మాత్రం జండాలు ఫ్లెక్సీలు దర్శనమిచ్చాయి. ఇదేంటని నిబంధలను బిజెపికి వర్తించవా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు ఎందుకు పట్టించుకోలేదనిని అంటున్నారు.

మండలి ఎన్నికలకు ప్రశాంతంగా జరగాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

శాసనమండలి ఎన్నికలను ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.కోటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం నుండి ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై అధికారులతో సమీక్ష చేశారు. స్థానిక సంస్థలు, పట్టభద్రులు ఉపాధ్యాయ మండలి నియోజకవర్గాలకు ఎన్నికలు జరుగుతున్నాయని అన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎక్కడ లోపాలు లేకుండా చూడాలని కోరారు. పోలింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బందికి త్వరలోనే శిక్షణ కార్యక్రమం కూడా నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. జిల్లాలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరగ కుండా చూడాలని ఆదేశించారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలకు పటిష్ట భద్రత: ఎస్పి

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

శివరాత్రి బ్రహ్మోత్సవాలకు పటిష్ట భద్రతను ఏర్పాటు చేశామని కర్నూలు జిల్లా ఎస్పి సిద్ధార్థ కౌశల్ తెలిపారు. శుక్రవారం ఆయన జగన్నాథ గట్టుపై ఉన్న రూపాల సంగమేశ్వరం ఆలయం బ్రహ్మోత్సవ భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాట్ల గురించి తీసుకోవలసిన భద్రత చర్యల గురించి ఆరా తీశారు. అన్నదాన పరిసరాలు, క్యూ లైన్లు, బారికేడ్లు, పార్కింగ్ స్థలాల ను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా , ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పి పోలీసు అధికారులకు సూచించారు. యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. దిశా పోలీసు స్టేషన్ డిఎస్‌పి వెంకట్రామయ్య, కర్నూలు పట్టణ డిఎస్‌పి కెవి మహేష్, కర్నూలు తాలుకా సిఐ రామలింగయ్య, తాలుకా ఎస్ఐలు లక్ష్మీనారాయణ, సమీర్ బాషా, ఆలయ ఇఒ గురువి రెడ్డి ఉన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ సిద్ధార్థ కౌశల్

పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించాలి

- నగరంలో సిఐటియు ఆధ్వర్యంలో ప్రచారం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని బుధవార పేట 15వ వార్డులో పోతుల నాగరాజును గెలిపించాలని సిఐటియు నగర ఉపాధ్యక్షులు కె.రామకృష్ణ, సివిల్ సప్లయ్ హమాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్.కృష్ణ శుక్రవారం ప్రచారం నిర్వహిహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కర్నూలు, కడప, అనంతపురం పశ్చిమరాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ పోతుల నాగరాజు ప్రభుత్వ ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యల కోసం పోరాడుతున్న ఆయనను గెలిపించుకోవాల్సిన బాధ్యత మన పట్టభద్రులు, మేధావులపై ఉందన్నారు. పోతుల నాగరాజు అందరి సమస్యల పైన అవగాహన ఉన్న వారని, ఇప్పటికే ప్రజా సంఘాల వారు ఉద్యోగస్తులు, రిటైర్ ఉద్యోగులు నిరుద్యోగ యువత గెలుపు కోసం ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రభుత్వ ఆధీనంలో ఉంచుకోవాలన్నా ఉద్యోగస్తుల పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్న నిత్యవసర సరుకులు తగ్గాలన్నా ప్రజల పక్షాన నిలబడి మాట్లాడే పిడిఎఫ్ ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సిఐటియు నాయకులు బి.మద్దిలేటి, ఇ, రమేష్ బాబు, కె.రాముడు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎంఎస్ నాయకులు ఎల్లాగువేరా

పోతుల నాగరాజును గెలిపించాల్సిన బాధ్యత అందరిది

గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజును గెలిపించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని సోషల్ మీడియా నాయకులు ఎల్లాగువేరా అన్నారు. శుక్రవారం పిడిఎఫ్ గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ పోతుల నాగరాజు గెలుపును కాంక్షించి లక్ష్మీనగర్‌లో ప్రవేట్ స్కూల్ టీచర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పోతుల నాగరాజు విద్యార్థి దశ నుండి నేటివరకు అనేక త్యాగలతో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసిన వ్యక్తి అన్నారు. నిరంతర సామాజిక స్పృహతో ప్రజాఉద్యమాలతో మమేకమైన పోతుల నాగరాజును ఏమ్మెల్సీ గా గెలిపించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు. పోతుల నాగరాజు కు మొదటి ప్రాధన్యత ఓటు వేసి వేయించి గెలిపించుకోవాలని ప్రవేట్ ఉపాధ్యాయులను కోరారు. మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకులు వి.వెంకటేశ్వర్లు, రజక సంఘం నాయకులు శేషాద్రి పాల్గొన్నారు.

బెళగల్ కొండల్లో కొండ చిలువలు సంచారం

- ట్రాక్టర్ కింద పడి ఒకటి మృతి

ప్రజాశక్తి-సి బెళగల్

సి.బెళగల్ కొండల్లో కొండ చిలువలు, కొండ త్రాచులు అధికంగా సంచరిస్తున్నాయి. గొర్రెల, మేకల, బర్రెల కాపరులు మందలతో వెళ్లి చూసిన వారంతా భయభ్రాంతులకు గురవుతున్నారు. శుక్రవారం ఏడు అడుగులున్న ఒక కొండ విష త్రాచు బురాన్ దొడ్డి రోడ్డులో ఒక మట్టిలోడు ట్రాక్టర్ కింద పడి మృతి చెందింది. అటుగా వెళ్తున్న వాహన దారులు,ప్రయాణికులు పలువురు చూసి బిత్తరపోయిన సంఘటన జరిగింది.




మృతి చెందిన కొండ చిలువ

ఆర్‌డిటి సహకారంతో గిరిజనుల అభివృద్ధి

- రూ.1.26 కోట్లతో గిరిజనులకు 23 పక్కా గృహాలు

ప్రజాశక్తి-తుగ్గలి

ఆర్‌డిటి స్వచ్చంద సేవా సంస్థ గిరిజనుల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని జడ్‌పిటిసి పులికొండ నాయక్, మాజీ జెడ్‌పిటిసి నారాయణ నాయక్, సర్పంచు లక్ష్మీదేవి లు అన్నారు. శుక్రవారం మండలంలోని జాప్లా తండాలో ఆర్డిటి సంస్థ స్పెయిన్ దేశానికి చెందిన కొందరి ఆర్థిక సహాయంతో రూ.ఒక కోటి 26 లక్షల 50 వేలతో గిరిజనులకు 23 పక్కా గృహాలు నిర్మించారు. దీంతో శుక్రవారం స్పెయిన్ దేశస్తులు పక్కా గృహాలను ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జడ్‌పిటిసి పులికొండ నాయక్, మాజీ జడ్‌పిటిసి నారాయణ నాయక్, సర్పంచి లక్ష్మీదేవి లు మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి ఆర్‌డిటి చేస్తున్న సహకారాన్ని ఎప్పుడు గిరిజనులు మర్చిపోరని వారు అన్నారు. ఆర్‌డిటి ఏరియా కోఆర్డినేటర్ రెహానా పాల్గొన్నారు.



స్పెయిన్ దేశస్థులను సన్మానిస్తున్న నాయకులు

ప్రతాప్ రెడ్డిని తక్షణమే సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

అధికార పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు అనుకూలంగా ప్రచారం నిర్వహిస్తున్న కడప ఆర్‌జెడి ప్రతాపరెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని సిపిఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. సిపిఐ సీనియర్ నాయకులు జిల్లా కార్యవర్గ సభ్యులు కె.జగన్నాథం, మనోహర్ మాణిక్యం , నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ అధికార పార్టీ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థికి అనుకూలంగా ప్రచారం నిర్వహిస్తున్న విద్యాశాఖ ఆర్‌జెడిపిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదోనిలో ఆయన పర్యటనను అడ్డుకున్న విద్యార్థి, యువజన సంఘాల పై అక్రమ కేసులు పెట్టడం సరైనది కాదన్నారు. వెంటనే కేసులను ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి వారు వినతిపత్రం అందజేశారు.

బాలసాయి బాబా మందిరంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

తుంగభద్ర నదీ తీరాన వెలసిన బాలసాయి బాబా ఆశ్రమంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్టు బలసాయిబాబా సెంట్రల్ మేనేజింగ్ ట్రస్టీ రామరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వస్తిశ్రీ చాంద్రమానేన శుభకృత్ నామ సంవత్సర ఉత్తరాయన మాఘ బహుళ త్రయోదశి శనివారం 18న మహాశివరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం ఆరుగంటలకు గణపతి పూజ, బాలసాయి బాబా వారికి , పంచామృత అభిషేకాలు, ఆర్చనలు, పూజాధికాలు, సాయంత్రం 6.30 గంటలకు ప్రథమ యామమున గణపతి పూజ మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 2వ యామమున రాత్రి 9 : 14 గంటలకు శివలింగానికి అన్నాభిషేకం, అర్చనలు పూజాభిషేకం, 3వ యామమున రాత్రి 12: 21గంటలకు లింగోర్భవ సమయాన విశేషద్రవ్యములతో అభిషేకాలు అర్చనలు, తదితర రోజంగా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

సి బెళగల్ మండలంలో అవీ - ఇవీ

ప్రజాశక్తి-సి బెళగల్ : బ్రాహ్మణదొడ్డిలో ఎంపిడిఒ రాముడు సచివాలయం తనిఖీ చేసి ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ముందుకు తీసుకెళ్ళాలన్నారు. తహసీల్దార్ శివశంకర్ నాయక్ విఆర్‌ఒలతో సమీక్షించి ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన కల్పించి, భూ సర్వేను పక్కడ్బెందిగా చేయాలనీ సూచించారు. అంబేద్కర్ ను దూసించిన అమర్ ప్రసాద్‌ను బహిరంగంగా ఉరితీయాలని అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షులు శశిదర్, జోజిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బెళగల్ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ బలరాం క్రీడా దుస్తులను సర్పంచి పాండురంగన్న చేతులమీదుగా పంపిణీ చేయించారు. మండలంలో రైతులకు 100శాతం ఇకెవైసిని త్వరగా పూర్తి చేయాలని ఎడిఎ సాలురెడ్డి, జెడిఎ దస్తగిరిరెడ్డి, ఎఒ మల్లేష్ కుమార్ తో సిబ్బంది సమీక్షలో ఆదేశించారు.



వార్షికోత్సవ వేడుకలను ప్రారంభిస్తున్న కోర్ డీన్ లింగేశ్వర్‌రెడ్డి

నారాయణలో కళాశాల వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నగరంలోని లక్ష్మీ నగర్ నారాయణ కళాశాల బ్రాంచ్ వార్షికోత్సవం వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. స్థానిక సాయి శ్రీనివాస ఫంక్షన్ హాల్లో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నారాయణ కళాశాల డీన్ లింగేశ్వర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని కోరారు. నీట్ 20 22లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. కార్యక్రమంలో కళాశాల డీన్ ఆంజనేయ రెడ్డి, ప్రిన్సిపల్ కౌసల్య, అధ్యాపక బందం తదితరులు పాల్గొన్నారు.

చట్టబద్ధతతో ఉద్యోగులకు ఆర్థిక భద్రత

ప్రజాశక్తి-కోడుమూరు

ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించే జీతాల చట్టం వస్తేనే ఉద్యోగులకు ఆర్థిక భద్రత ఉంటుందని ఆ దిశగా ప్రతి ఒక్క ఉద్యోగి పోరాడాలని ఆ హక్కును సాధించుకోవాలని ఈ నిర్ణయానికి అన్ని ఉద్యోగ సంఘాలు ఒకే వేదికపై రావాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు భంగి శ్రీధర్ అన్నారు. జీతాలు బకాయిలు చెల్లింపులు చట్టబద్ధత అనే అంశంపై శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కోడుమూరు లోని పెన్షనర్స్ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చలో వేదికలో పలువురు ఉద్యోగ సంఘం నాయకులు మాట్లాడుతూ సకాలంలో జీతాలు ఉద్యోగులకు రావాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రతినిధులు జడ్జిలు ముఖ్యమంత్రులు ఇలా ప్రతి ఒక్కరి జీతాలు ఇవ్వడానికి ప్రత్యేక చట్టమే ఉందని అలాంటిది ప్రభుత్వం ఉద్యోగులకు ఒక చట్టాన్ని సాధించుకోవాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. నెల రోజులు పనిచేసి ఒకటవ తేదీన జీతం కోసం ఎదురు చూడటం కష్టపడిన పనికి వేతనం అడిగే హక్కు కూడా లేకుండా ఉందన్నారు. ఒకటవ తేదీన వేతనాలు ఇవ్వాలని హక్కును సాధించుకోవాలని అందుకోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని అందరూ తీర్మానించారు. కొన్ని ఉద్యోగ సంఘాలు ఇక్కడ ఒక మాట అక్కడ ఒక మాట మాట్లాడుతూ ఉద్యోగుల పొట్ట కొడుతున్నారు. ఎపిజిఎ మెంబర్స్ చెప్పారు. జిల్లా అధ్యక్షులు భంగి శ్రీధర్ నేతృత్వంలో వహించిన ఈ చర్చా వేదికకు మెడికల్ పంచాయతీరాజ్ అగ్రికల్చర్ సెరికల్చర్ ఐసిడిఎస్ రెవెన్యూ ట్రెజరీ డిపార్టుమెంటులతోపాటు రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొని తమ అభిప్రాయాలను తెలిపారు. ఈ సమావేశంలో ఎపిజిఎ జిల్లా అధ్యక్షులు ఉపాధ్యక్షులు, సెక్రటరీలు పాల్గొన్నారు.కోడుమూరు తాలూకా అధ్యక్షులు చిలుక విజయ్ కుమార్, తాలూకా కార్యదర్శి , రాఘవయ్య, తాలూకా కోశాధికారి ,మధు శేఖర్ , తాలూకా ఆర్గనైజింగ్ సెక్రటరీ ముర్తుజావలి , అసోసియేషన్ ప్రెసిడెంట్ పిఎం ఖాన్ , అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పి.సలీం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు బుంగిశ్రీధర్



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డిఇఒ సుకుమార్

పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి-తుగ్గలి

పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని డిప్యూటీ డిఇఒ సుకుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన తుగ్గలి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల చదువుపై ఉపాధ్యాయులకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఇఒ సుకుమార్ మాట్లాడుతూ 10వ తరగతిలో సబ్జెక్టు ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను ప్రతి ఉపాధ్యాయుడు అందించాలన్నారు. తన సబ్జెక్టులో వందకు వంద మార్కుల సాధించే విధంగా చొరవ తీసుకోవాలన్నారు. పిల్లలు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ రామ వెంకటేశ్వర్లు గౌడ్, ప్రధానోపాధ్యాయులు ఉమా, వివిధ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం ఎంఆర్‌సిలో రికార్డులను పరిశీలించారు.

సంతాన లేమిని తీరుస్తున్న ‘ ఓయాసిస్’

ఘనంగా ఓయాసిస్ మొదటి వార్షికోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

సంతానంలేని దంపతులకు సంతానం కలిగించడంలో ఒయాసిస్ సేవలు కర్నూలు నగరంలో అందుబాటులో ఉన్నాయని వైసిపి నాయకురాలు ఎస్.వి.విజయ మనోహరి అన్నారు. శుక్రవారం కర్నూలు నగరం గాయత్రీ ఎస్టేట్‌లోని ఓయాసిస్ ఫర్టిలిటీ సెంటర్ మొదటి వార్షికోత్సవ కార్యక్రమానికి ఎస్ వి విజయ మనోహరి, బిజెపి అధికార ప్రతినిధి డాక్టర్ వినుషా రెడ్డి, యోగా మాస్టర్ బిటి విజయలక్ష్మి హాజరయ్యారు. ఐవిఎఫ్ ద్వారా గర్భం దాల్చిన జంటలను సత్కరించారు. మొదటి వార్షికోత్సవ సందర్భంగా కేక్ కట్ చేసి వేడుక నిర్వహించారు. ఎస్.వి.విజయ మనోహరి మాట్లాడుతూ అధునాతన సాంకేతికతలు, చికిత్స ఎంపికల గురించి సంతానలేమి సమస్యతో బాధపడుతున్న జంటలకు శుభవార్తను తెలపడం ప్రస్తుతం ఎంతో అవసరం అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రఖ్యాత సంతానసాఫల్య కేంద్రాలలో ఒకటి ఓయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్ అన్నారు. కర్నూలు ఓయాసిస్ ఫెర్టిలిటీ క్లినికల్ హెడ్అండ్ ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఈ అద్భుతమైన వేడుకలో భాగమైనందుకు నాకు చాలా ఆనందంగా ఉందన్నారు. కాబోయే తల్లులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఒయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్‌లో పురుషులు, మహిళలు ఇద్దరికీ వారి సొంత జీవసంబంధమైన (బయోలాజికల్) పిల్లలను పొందేలా అన్ని రకాల అధునాతనమైన సంతానోత్పత్తి చికిత్సలను అందిస్తున్నామన్నారు. వయసు పెరిగే కొద్దీ సంతానోత్పత్తి సామర్థ్యం కూడా తగ్గుతుందని దంపతులు తెలుసుకోవాలి. అందువలన ఎంత త్వరగా వైద్యపరమైన జోక్యం చేసుకుంటే అంత మంచి ఫలితాలు వస్తాయి. డాక్టర్ వినూష రెడ్డి మాట్లాడుతూ వార్షికోత్సవం జరుపుకుంటున్న ఒయాసిస్ సెంటర్ సిబ్బందికి శుభాభినందనలు తెలిపారు. మనదేశంలో 2 కోట్ల 73 లక్షలమంది సంతానలేమితో బాధపడుతున్నారని తెలిపారు. బిటి. జయలక్ష్మి మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని యోగా అందరూ చేయాలన్నారు. ఓయాసిస్ దినదినాభివృద్ధి చెందాలని కోరుకున్నారు. 2009 లో హైదరాబాద్ లో స్థాపించి స్వల్ప కాలంలోనే దేశావ్యాప్తంగా 30 బ్రాంచులలో విస్తరించి ప్రముఖ ఆసుపత్రిగా మారిందని తెలిపారు.



ఓయాసిస్ మొదటి వార్షికోత్సవంలో విజయమనోహరి, వైద్యులు



సిఎంను కలిసిన ఎమ్మెల్యే , టి.సురేంద్రారెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఆదోని ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డితోపాటు , వైసిపి రాష్ట్ర నాయకులు, అసెంబ్లీ పరిశీలకులు తెర్నేకల్ సురేందర్ రెడ్డి విజయవాడలోని ముఖ్యమంత్రి తన వ్యక్తిగత కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఆదోని నియోజకవర్గంతో పాటు పలు ప్రాంతాల్లోని సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. జిల్లా అభివృద్ధికి సహకారాన్ని ఇవ్వాలని కోరినట్లు సురేంద్ర రెడ్డి శుక్రవారం తెలిపారు.



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ఎమ్మెల్సీగా పోతుల నాగరాజును గెలిపిద్దాం

- ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రచారం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పశ్చిమ రాయలసీమ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజుకు ఓటు వేసి గెలిపించాలని సిఐటియు, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, వృత్తి సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు కోరారు. శుక్రవారం పట్టణంలోని శ్రీనివాస టాకీసు దగ్గర ఉన్న సచివాలయం, శ్రీమాచాని సోమప్ప ఇంగ్లీష్ మీడియం స్కూల్, సిద్ధార్థ కళాశాల, రవీంద్ర స్కూల్స్, వేణు విద్యాలయంలో ఉన్న ఎమ్మెల్సీ ఓటరు అభ్యర్థులను, ఉపాధ్యాయులను కలిసి ఓటు వేయాలని అభ్యర్థిస్తూ ప్రచారం నిర్వహించారు. సిఐటియు రాష్ట్ర నాయకులు బి.రామాంజనేయులు, వృత్తి సంఘాల నాయకులు పి.గోవిందు, రైతు సంఘం నాయకులు హనుమంతు, ఎస్ఎఫ్ఐ నాయకులు రంగప్ప, డివైఎఫ్ఐ నాయకులు శేషప్ప పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- డిఇఒ రంగారెడ్డి

ప్రజాశక్తి - దేవనకొండ



సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ రంగారెడ్డి

మానసిక స్థైర్యం, ఆత్మవిశ్వాసంతో చదివినప్పుడే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించగలరని డిఇఒ వి.రంగారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని తెర్నేకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పరీక్ష పర్వ 4.0 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. సీ, డీ గ్రేడ్ విద్యార్థులు పరీక్షల్లో ఏ విధంగా ఉత్తీర్ణత సాధించాలో అనేదానిపై మెళకువలు తెలిపారు. అనంతరం డైట్ అధ్యాపకులు షంషుద్దీన్, అరుణాచలం రెడ్డి మాట్లాడారు. ప్రతి మనిషీ జీవితంలో అత్యున్నత స్థానానికి చేరుకోవడానికి చదువు ఎంతో ముఖ్యమని తెలిపారు. చదువు లేకపోతే ఏమీ సాధించలేమని చెప్పారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

- ఎంఇఒ సుదర్శన్‌రెడ్డి

ప్రజాశక్తి - నందవరం

విద్యార్థుల్లో మంచి పఠనాభివృద్ధితో పాటు విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని ఎంఇఒ సుదర్శన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం నందవరంలోని తెలుగు మెయిన్ ప్రాథమిక పాఠశాల, ఉర్దూ పాఠశాలలను తనిఖీ చేశారు. పాఠశాలకు సంబంధించిన అన్ని రకాల రికార్డులు, రిజిస్టర్లను, మధ్యాహ్న భోజన మెనూను పాటిస్తున్నారా లేదా పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. అలాగే తెలుగు మెయిన్ పాఠశాల, ఉర్దూ పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు ఫేస్-2 పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాడు-నేడు పనులను పారదర్శకంగా నిర్వహించాలని, ఎటువంటి అవినీతి, అక్రమాలకు తావివ్వకుండా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు నాణ్యత ప్రమాణాలను పాటించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలకు లోబడి సకాలంలో పూర్తి చేయాలన్నారు. అనంతరం పాఠశాలలోని తరగతి గదిలో విద్యార్థులను ప్రధానంగా ఆంగ్లం, గణిత భావనలను పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ జయంతి, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ ఉరుకుంది, పాఠశాల సిబ్బంది నరసప్ప, మహబూబ్ బాషా పాల్గొన్నారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒ సుదర్శన్ రెడ్డి

పశు పోషణతో అభివృద్ధి

- జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ రామచంద్రయ్య
- కుంకనూరులో లేగ దూడల ప్రదర్శన

ప్రజాశక్తి- దేవనకొండ

పశు పోషణతో ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ కె.రామచంద్రయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని వెలమకూరు పశువైద్యశాల కింద ఉన్న రైతు భరోసా కేంద్రం కుంకనూరు గ్రామంలో లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఉపసంచాలకులు డాక్టర్ రాజశేఖర్, కర్నూలు డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ వి.దుర్గాప్రసన్న, గోనెగండ్ల ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ జి.వెంకటేశ్వర్లు, సహాయ సంచాలకులు డాక్టర్ మల్లన్న హాజరయ్యారు. 45 లేగ దూడల ప్రదర్శన చేపట్టారు. ఈ లేగ దూడల్లో ముర్రా జాతి గేదె దూడలు, ఒంగోలు జాతి దూడలు, సాహివాల్, గిర్ జాతి దూడలు ఉన్నాయి. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడారు. దేశవాళీ ఆవులకు, గేదెలకు స్వచ్ఛమైన ఒంగోలు, ముర్రాజాతి ఎద సూదులు వేయించాలని తెలిపారు. తద్వారా జాతి లక్షణాలు అభివృద్ధి చెంది పాల దిగుబడి పెరిగి, రైతులు ఆర్థికంగా బలోపేతం అవుతారని చెప్పారు. పశుసంవర్ధక శాఖలో ప్రస్తుతం లింగ నిర్ధారణ వీర్య నాళికలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీటి ద్వారా కచ్చితంగా ఆడదూడలు పుడతాయని, రైతులు అందరూ ఈ కృత్రిమ గర్భోత్పత్తి లింగ నిర్ధారణ వీర్య నాళికలను ఉపయోగించుకొని ఆడ దూడల సంతతి పెంచుకోవాలని సూచించారు. కుంకనూరు గ్రామంలో పశు సంవర్ధక సహాయకుడిగా పని చేస్తున్న బి.హనుమన్నను అభినందించి అతనికి ప్రోత్సాహకంగా రూ.5000 సొంత డబ్బును చెక్కు రూపంలో అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దూడల్లో నాలుగు స్వచ్ఛమైన దూడలకు బహుమతి ప్రదానం చేశారు. డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, వెలమకూరు పశు వైద్యాధికారి డాక్టర్ ఎన్‌జి.వెంకటేష్, దేవనకొండ పశు వైద్యాధికారి డాక్టర్ కె.అనిలా పాల్గొన్నారు.



లేగ దూడల ప్రదర్శనలో పాల్గొన్న అధికారులు

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

- తహశీల్దార్ వేణుగోపాల్

ప్రజాశక్తి - గోనెగండ్ల

వేసవి సమీపిస్తున్న తరుణంలో మండలంలోని వివిధ గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా తగిన చర్యలు చేపట్టాలని ఎంపిపి నసురుద్దీన్, తహశీల్దార్ వేణుగోపాల్, ఎంపిడిఒ ప్రవీణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు వారికి సంబంధించిన ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడారు. మండలంలో అన్ని గ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా అధికారులు, స్థానిక సిబ్బంది ముందస్తుగా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. అంగన్వాడీలు, ఆశావర్కర్లు పనితీరును మెరుగుపరచుకోవాలని ఎంపిడిఒ సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామాల్లో వీధి కుక్కలు, కోతుల బెడదను నివారించేందుకు తగిన చర్యల గురించి ప్రణాళిక రూపొందించాలని పశు వైద్య అధికారికి ఇఒఆర్‌డి నగేష్ సూచించారు. టి.బందే నవాజ్, కోఆప్షన్ సభ్యులు రఫుల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహశీల్దార్ వేణుగోపాల్

డాక్టర్ వైఎస్ఆర్ అగ్రి ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ ఆకస్మిక తనిఖీ



ల్యాబ్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి - మంత్రాలయం

డాక్టర్ వైఎస్ఆర్ అగ్రి ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ను శుక్రవారం అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. తిరుపతి నుంచి రీజనల్ కోడింగ్ సెంటర్, వ్యవసాయ ఉప సంచాలకులు డి.మల్లికార్జున, ఎడిఎ అగ్రగామి బాలవర్ధిరాజులు సందర్శించి ల్యాబ్‌లో జరుగుతున్న విత్తనాలు, ఎరువుల నాణ్యతను ఏ విధంగా పరీక్ష చేస్తారో తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఎఒ అనిల్ కుమార్, శ్రీధర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రెండు గడ్డివాములు దగ్ధం

- రూ.50 వేల ఆస్తి నష్టం

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని పి.కోటకొండ గ్రామంలో శుక్రవారం ప్రమాదవశాత్తు సంభవించిన విద్యుదాఘాతంతో ముల్లా మాబుకు చెందిన రెండు గడ్డివాములు దగ్ధమైన సంఘటన చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు... గ్రామ శివారులోని వాము దొడ్డిలో విద్యుదాఘాతంతో మంటలు వ్యాప్తి చెందాయి. ముల్లా మాబుకు చెందిన మేతవాములు కాలిపోవడంతో రూ.50 వేల నష్టం సంభవించింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. కోడుమూరు నుంచి అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన వచ్చి ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపులోకి తెచ్చారు. మంటలు వ్యాప్తి చెందకుండా అదుపులోకి రావడంతో సమీపంలో ఉన్న రైతుల వాముదొడ్లకు ప్రమాదం తప్పడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.



మంటలను అదుపులోకి తెస్తున్న అగ్ని మాపక సిబ్బంది

ప్రజా ప్రతినిధులారా..! నోరు తెరవండి...

- 'అప్పర్ భద్ర' నిర్మాణాన్ని ఆపేలా ఉద్యమం - మద్దతు ఇవ్వాలని ఆర్‌సిసి విజ్ఞప్తి

ప్రజాశక్తి - ఆదోని

తుంగభద్రపై కర్ణాటక ప్రభుత్వం నిర్మిస్తున్న 'అప్పర్ భద్ర' ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకునేందుకు ఐక్య ఉద్యమానికి సన్నద్ధం కావాలని ఆర్‌సిసి వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ రెడ్డి కోరారు. శుక్రవారం ఆదోనిలోని రాయలసీమ కోఆర్డినేషన్ కమిటీ కార్యాలయంలో పాదయాత్ర గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ ప్రాంత ప్రజల ప్రయోజనాలకు ముప్పు వాటిల్లుతున్నా ఎంపీ, ఎమ్మెల్యేలు నోరు మెదపక పోవడం ఏమిటని నిలదీశారు. అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకునేలా సుప్రీంకోర్టులో కేసు వేయాలని ఇంతకుముందే ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామన్నారు. తుంగభద్ర డ్యాంపై తాగు, సాగునీటికి ఆధారపడి ఉన్నామని తెలిపారు. వర్షాలు సక్రమంగా కురవకపోతే తుంగభద్ర డ్యాంకు జూన్ వరకు కూడా నీరు చేరని పరిస్థితి ఉందని చెప్పారు. ఎగువ ప్రాజెక్టు నిర్మాణం జరిగితే నీరు చేరడం కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంత ప్రజల తాగు, సాగునీటి కోసం రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు కలిసి రావాలని కోరారు. అప్పర్ భద్ర నిర్మాణం ఆపాలని కోరుతూ ఈనెల 25 నుంచి 28 వరకు ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. 25న ఆర్‌డిఎస్ కాలువ నుంచి రాయలసీమ ఉద్యమ నాయకులు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర నిర్వహిస్తారన్నారు. అక్కడి నుంచి రోజూ 20 కిలోమీటర్ల చొప్పున కోసిగి, కౌతాళం, పెద్దకడబూరు మీదుగా 27 వరకు పాదయాత్ర ఉంటుందని తెలిపారు. అక్కడి నుంచి పాదయాత్రగా చేరుకొని 28న ఆదోని రిక్రియేషన్ క్లబ్‌లో బహిరంగ సభ ఉంటుందన్నారు. అభ్యుదయవాదులు తమ పోరాటానికి కలిసి రావాలని కోరారు. ఈ ప్రాంత రైతు ప్రయోజనాల కోసం చేపట్టే ఆందోళనకు తాము మద్దతు ఇస్తున్నామని అడా వ్యవస్థాపకులు ఆదినారాయణ రెడ్డి, ఎల్ఎల్‌సి నీటి వాటా పరిరక్షణ కమిటీ సభ్యులు సాయిబాబు, విశ్రాంత తహశీల్దార్ షేక్షావలీ తెలిపారు. ఆర్‌సిసి నాయకులు రాజ్ కుమార్, బసవ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్ రెడ్డి



శ్రీగురు వైభవోత్సవాలను విజయవంతం చేయండి

- శ్రీమఠం మేనేజర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో జరగనున్న శ్రీగురు వైభవోత్సవాలను భక్తులు విజయవంతం చేయాలని శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం ఆయన స్థానిక శ్రీమఠం పరిపాలనా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి 26 వరకు శ్రీగురు వైభవోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈనెల 22న బృందావనానికి విశేష మహా పంచామృతాభిషేకం, అభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాఘవేంద్రస్వామి జయంతి సందర్భంగా 26న టిటిడి నుంచి తెచ్చిన పట్టువస్త్రాల సమర్పణ, చెన్నైకి చెందిన నాదాహార ట్రస్టు ఆధ్వర్యంలో సుమారు 450 మంది సంగీత విద్వాంసులతో వివిధ సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు, రథోత్సవాలు ఉంటాయని వివరించారు. స్వామి వారు రచించిన గ్రంథాలపై పండితుల ద్వారా ఉపన్యాసాలు ఉంటాయని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా వసతి, భోజన సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

మిల్లు కార్మికులకు భవిష్య నిధి బకాయిలు చెల్లించి ఆదుకోవాలి

- ఆదోని రాయలసీమ మిల్స్ మజ్దూర్ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని



మూతబడి 21 ఏళ్లయినా రాయలసీమ మిల్లు కార్మికులకు పెండిగ్‌లో ఉన్న పిఎఫ్ బకాయిలను ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వెంటనే చెల్లించాలని ఆదోని రాయలసీమ మిల్స్ మజ్దూర్ సంఘం నాయకులు కె.లింగన్న, ఎన్.మోహన్ ప్రసాద్, ఎం.చాలన్న, జి.శాంతన్న, మిల్లు కార్మికుడు నారప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం వారు ఆదోనిలో విలేకరులతో మాట్లాడారు. యాజమాన్యం మిల్లులోని యంత్రాలను అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు గాని కార్మికులకు రావాల్సిన భవిష్య నిధి ఇంతవరకు చెల్లించలేదని తెలిపారు. భవిష్య నిధి శాఖను సంప్రదిస్తే యాజమాన్యం వారు భవిష్య నిధి చెల్లించలేదని, అర్జీలను వెనక్కి పంపుతున్నారని అన్నారు. ఒక్కసారి మానవత్వంతో ఆలోచించి భవిష్య నిధిని చెల్లించి కార్మికులను ఆదుకోవాలని కోరారు. బెనిఫిట్ పొందకుండానే కొందరు కార్మికులు చనిపోయారన్నారు. అధికారులు జోక్యం చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

- కర్ణాటకలో సంఘటన

ప్రజాశక్తి - ఆదోని

కర్ణాటక రాష్ట్రం సైదాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదోనికి చెందిన ఇద్దరు యువకులు మృతి చెందారు. గురువారం ఆదోని పట్టణం నుంచి కారులో గుల్బర్గాకు బయల్దేరిన యువకులు రోడ్డు ప్రమాదానికి గురైనట్లు బంధువులు తెలిపారు. పట్టణంలోని హనుమాన్ నగర్‌కు చెందిన కంచి జ్ఞానేశ్వర్, కౌడల్ పేటకు చెందిన డ్రైవర్ సైపుల్లాలు అక్కడికక్కడే మృతి చెందినట్లు వివరించారు. మార్గమధ్యంలో సైదాపూర్ వద్ద వీరి వాహనాన్ని లారీ ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు. మృతి విషయం తెలుసుకున్న వారి బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. పట్టణంలోని హనుమాన్ నగర్, కౌడల్ పేటలో తీవ్ర విషాద ఛాయలు నెలకొన్నాయి.

రెవెన్యూలో ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోండి : జెసి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రెవెన్యూ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని జెసి రామసుందర్ రెడ్డి ఆదేశించారు. రెవెన్యూ శాఖలో ఆయా క్యాడర్ వారీగా ఉద్యోగుల ఖాళీల వివరాలను తీసుకోవాలని ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్ కార్యాలయంలో నుంచి రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. భూ సర్వే పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. స్పందనలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. అలాగే పలు అంశాలపై కూడా రెవెన్యూ శాఖ అధికారులతో చర్చించారు.

ఇంటర్ విద్యార్థులకు 'పర్యావరణ' పరీక్ష

కర్నూలు కలెక్టరేట్ : ఉమ్మడి జిల్లాలోని ఇంటర్మీడియట్ విద్యార్థులకు శుక్రవారం పర్యావరణ సబ్జెక్టుకు సంబంధించిన పరీక్ష నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 36 జూనియర్ కళాశాలలో జరిగిన ఈ పరీక్షకు 32,601 మంది విద్యార్థులు హాజరు కాగా 1,086 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కర్నూలు నగరంలోని పలు పరీక్ష కేంద్రాల్లో ఆర్ఐఒ ఎస్‌విఎస్.గురువయ్య శెట్టి పరిశీలించారు. అక్కడ ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పరీక్షలు నిర్వహించామని ఆయన పేర్కొన్నారు.

'ఒక్క ఛాన్స్'తో ప్రజలను నట్టేట ముంచిన జగన్

- టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాధవరావు దేశాయి

ప్రజాశక్తి - నందవరం

ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలను నట్టేట ముంచారని టిడిపి నాయకులు మండిపడ్డారు. శుక్రవారం నందవరంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' 2వ రోజు కొనసాగింది. గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి, ప్రజలు ఎటువంటి సమస్యలు ఎదుర్కొంటున్నారో, అధికార వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రజలను బాధించే అంశాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాధవ రావు దేశాయి, మండల ఉపాధ్యక్షులు ఖాసీం వలీ, టిడిపి కన్వీనర్ చిన్న రాముడు, ఎల్ఎల్‌సి మాజీ డైరెక్టర్ గడ్డం నారాయణరెడ్డి, మండల బీసీ సెల్ అధ్యక్షులు గోపాల్, టిడిపి సీనియర్ నాయకులు పెద్ద రాముడు మాట్లాడారు. అత్యంత వెనుకపడిన పశ్చిమ ప్రాంతానికి తాగు, సాగునీరు అందించకుండా రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. మాజీ మంత్రి బీవీ.మోహన్ రెడ్డి కలల స్వప్నం శ్రీగురు రాఘవేంద్ర ప్రాజెక్టు నిర్మించి, ఆర్‌డిఎస్ కుడికాలువ నిర్మాణం చేపడితే పశ్చిమ ప్రాంతాలైన ఎమ్మిగనూరు, కోడుమూరు, ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాలు సస్యశ్యామలం అయ్యేవని తెలిపారు. వాటి నిర్మాణానికి రూ.2 వేల కోట్లు నిధులు తెస్తే వైసిపి వచ్చిన తర్వాత ఆ ప్రాజెక్ట్ ఊసే లేకుండా జిల్లా మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు నోరు మెదపడం లేదన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే వాటి నిర్మాణాన్ని మాజీ ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర రెడ్డి చేపట్టి ప్రతి ప్రాంతాన్ని పచ్చని పొలాలతో సస్యశ్యామలం చేస్తారని చెప్పారు. టిడిపి నాయకులు తిమ్మరాజు, రంగయ్య, వీరేష్, మస్తాన్, గోపాల్ పాల్గొన్నారు.



సమస్యలను తెలుసుకుంటున్న టిడిపి నాయకులు

'జర్నలిస్టులకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలి'

ప్రజాశక్తి - పత్తికొండ

పత్తికొండ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులందరికీ ప్రభుత్వం ఇంటి పట్టాలు మంజూరు చేయాలని జర్నలిస్టులు శ్రీనివాస్ గౌడ్, వెంకటేశ్వర్లు, మధుబాబు, నాగరాజు కోరారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ విష్ణు ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గతంలో దాదాపు పదేళ్ల క్రితం పట్టణంలోని కర్నూలు రోడ్డు వెలుగు కార్యాలయం దగ్గర రెవెన్యూ అధికారులు జర్నలిస్టులకు ఇంటి పట్టాలు మంజూరు చేశారని తెలిపారు. 2015 తర్వాత మరికొంతమంది జర్నలిస్టులు వృత్తిలోకి వచ్చారని, గతేడాది నుంచి జర్నలిస్టులకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని ఆర్‌డిఒ, తహశీల్దార్లకు వినతి పత్రాలు ఇచ్చామని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా జర్నలిస్టులకు ఇంటి పట్టాల మంజూరు చేయాలని అనుమతులు ఇచ్చిందని తెలిపారు. జర్నలిస్టులందరికీ ఇంటి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. జర్నలిస్టులు గిడ్డయ్య, హనుమంతు, నాగరాజు, నూర్ బాషా, రవిచంద్ర, తాజ్, నరేంద్ర, నజీర్, జయరాం నాయక్, ఈశ్వర్, రవి, గోపాలకృష్ణ, షఫీ, దారకొండయ్య, శ్రీనివాస్, సుధాకర్ పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

ప్రశాంతంగా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పరీక్ష

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

గ్రూప్-2 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మెయిన్స్ పరీక్ష శుక్రవారం కర్నూలులో ప్రశాంతంగా జరిగిందని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌వి.నాగేశ్వరరావు వెల్లడించారు. స్థానిక కెవి.సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం జరిగిన మెయిన్స్ పరీక్షకు 172 మంది హాజరు కాగా 11 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 172 మంది హాజరయ్యారన్నారు.

నరసింగప్ప కొండ స్థలం పరిశీలన

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని నరసింగప్ప కొండ స్థలాన్ని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి శుక్రవారం పరిశీలించారు. గోనెగండ్లలోని 581/1 గ్రామకంఠం సర్వే నెంబర్‌లో 3.70 ఎకరాల 70 సెంట్ల స్థలం ఉంది. నరసింగప్ప కొండ స్థలంలో అప్పటి పత్తికొండ ఎమ్మెల్యే శేషిరెడ్డి హయాంలో కొంతమందికి పట్టాలు పంపిణీ చేశారు. ఇందులో రజకులకు, ఈడిగ సామాజిక వర్గానికి సమస్యలు తలెత్తడంతో అప్పట్లో కొంతమంది కోర్టును ఆశ్రయించి స్టే పొందారు. ప్రస్తుతం ఆ స్థలంలో తిరిగి పట్టాల పంపిణీ విషయంలో రజకులకు, ఈడిగ, గౌడ్‌లకు సమస్యలు తలెత్తాయి. సమస్యను ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో శుక్రవారం సాయంత్రం ఆయన స్థలాన్ని పరిశీలించారు. ఇరు వర్గాలను అడిగి సమస్యను తెలుసుకొని సామరస్యంగా పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎంపిపి నసురుద్దీన్, మాజీ సర్పంచి నాగేష్ నాయుడు, యూత్ నాయకులు బందే నవాజ్, వైసిపి మండల కన్వీనర్ దొరబాబు నాయుడు, టి.మురళీ నాయుడు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎర్రకోట



మాట్లాడుతున్న డాక్టర్ గోపీనాథ్

విద్యార్థినులకు కంటి, దంత పరీక్షలు

ప్రజాశక్తి - ఆదోని

మండలంలోని ఆరేకల్లులో ఉన్న బాలికల రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థినులకు శుక్రవారం ఆదోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ సంయుక్తంగా కంటి, దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్ డాక్టర్ గోపీనాథ్ మాట్లాడారు. ఉదయం నుంచి పడుకునే వరకు పాటించాల్సిన ఆహార నియమాలు, వ్యక్తిగత శుభ్రత తదితర అంశాలను వివరించారు. కంటి వైద్యులు డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ ఉషా రావు మాట్లాడుతూ... సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల కంటి జబ్బులు రాకుండా చేయవచ్చని తెలిపారు. అనంతరం డాక్టర్ అల్తాఫ్ హుస్సేన్, డాక్టర్ వినయ్ కుమార్ మాట్లాడారు. రోజూ ఉదయం, సాయంత్రం పండ్లను శుభ్ర పరచుకోవాలని, అతి శీతలంగా ఉండే పదార్థాలు, అతి వేడిగా ఉండే పదార్థాలు తినకూడదని సూచించారు. ఆదోని లయన్స్ క్లబ్ ఛైర్మన్ ప్రసాదరావు, అధ్యక్షులు ధర్మారెడ్డి, సభ్యులు గోవిందరావు, ఓం ప్రకాష్ పాల్గొన్నారు.


19న ఆదోనిలో శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపన

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని ఫారెస్టు లైన్‌లో వెలసిన శ్రీఅంబాభవాని దేవాలయం ఆవరణలో ఈనెల 19న శ్రీఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహిస్తున్నట్లు ఉత్సవ సమితి సభ్యులు కునగిరి నీలకంఠ శుక్రవారం తెలిపారు. సాయంత్రం పట్టణంలోని మున్సిపల్ రోడ్డు వరకు శోభయాత్ర ఉంటుందన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ పరిశీలన

ప్రజాశక్తి-ఆలూరు



ల్యాబ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఆలూరు వ్యవసాయ డివిజన్ పరిధిలోని మార్కెట్ యార్డు కార్యాలయంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌ను డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ మల్లికార్జునయ్య పరిశీలించారు. శుక్రవారం ల్యాబ్ పనితీరును, పరీక్ష చేసే పరికరాల పని విధానము, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ పనితీరును పరిశీలించినట్లు తెలిపారు. రైతులకు ఉపయోగపడే విధంగా అగ్రి ల్యాబ్‌ను తీర్చిదిద్దాలన్నారు. ఆలూరు వ్యవసాయ సహాయ సంచాలకులు సునీత, జిల్లా వ్యవసాయ కార్యాలయ అధికారి బాలవర్ధిరాజు, ఎఒ వెంకటేష్ గౌడ్, ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ ఎఒ రాజేష్, ఎఇఒ షేక్షావలీ పాల్గొన్నారు.





పట్టు వస్త్రాలను తీసుకొస్తున్న దృశ్యం

బాబోయ్.. దోమలు...

- సాయంత్రం ఆరు దాటితే దండయాత్ర
- దోమల నివారణకు చర్యలు శూన్యం
- కంపు కొడుతున్న మురికి కాలువలు

ప్రజాశక్తి - నంద్యాల రూరల్


నంద్యాల మండలంలో గ్రామీణ ప్రాంతాల్లో దోమలు హడలెత్తిస్తున్నాయి. సాయంత్రం ఆరు దాటితే దోమల దండ యాత్ర మొదలౌతుది. దీంతో ప్రజలు ఆరుబయట కాసేపు సరదాగా మాట్లాడుకుందాం అనుకున్న.. అలా ఆరుబయట తిరగుదామనుకున్నా దోమల దాడికి నిలువ శక్యము కాక దోమలు బాబోయ్ దోమలు అని ఇళ్లల్లోకి పరుగులు పెట్టి తలుపులు మూసుకుం టున్నారు. ఏదైనా అవసరాల కోసం పొరపాటున తలుపులు తెరిస్తే అదే అదునుగా..దోమలు తేనెటీగల దండులాగ మందలు, మందులు చొచ్చు కొని ఇళ్ళలోకి ప్రవేశిస్తున్నాయి. వాటిని కంట్రోల్ చెయ్యడానికి మార్కెట్‌లో దొరికే రక రకాల దోమల నివారణకు ఉపయోగించే విష పూరిత పరికరాలు వాడి వాటివల్ల ప్రజలు రోగాల బారినా పడుతున్నారు. విష పదార్థాలనుండి వెలువడే వాయువుల వలన చిన్న పిల్లలు తీవ్ర అస్వస్థతకు గురౌతున్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే అని అధికారులు నిర్ణయించారు. ఆరోగ్య సిబ్బంది గ్రామా ల్లో తిరుగుతూ దోమల నివారణకు తగిన జాగ్రతలు తెలియజేస్తూ కూలర్లలో, పూల కుండీలలో తాగి పడేసిన కొబ్బరి కాయలలో, పాత టైర్ లలోనీరు



నిల్వ అయితే దోమలు గుడ్లు పెట్టీ దోమలు వృద్ధి చెందుతాయని ప్రజలకు తెలియజేస్తూ ఇంటింటికి తిరిగి శానిటేషన్ చేయించాలి. కాని అటువంటి కార్యక్రమాలు చెయ్యకుండా ప్రజల ఆరోగ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గ్రామాల్లోడ్రైనేజ్‌లు లేక బట్టలు పిండిన నీరు, బాత్రూములలోని నీళ్ల రోడ్ల మీద చేరడం, ఎక్కడ చూసినా పిచ్చి మొక్కలుపెరగడం, గ్రామాల మధ్య లో ఉన్న ఒకప్పటి పంట కాలువ లు ఇప్పుడు మురికి కాలువ లుగా మారి చెత్త చెదారం పేరుక పోవడం, అటువం టి కాలువలలో పూడిక తొలిగించకపోవడం వలన దోమల వృద్ధి చెంది కంటిమీద కనుకులేకుండా చేస్తున్నాయి. దోమల నివారణచర్యల కోసం చేయాల్సిన పంచాయితి అధికారులు గాని పాలకులు గాని పట్టించుకోవడంలేదని, పంచాయతీ అధికారులు మాత్రం శానిటేషన్ కోసం లక్షలు రూపాయలు ఖర్చు అయినట్లు తప్పుడు లెక్కలు చూపిస్తున్నారని, కాని చర్యలు మాత్రం శూన్యం అని గ్రామల లో ప్రజలు చర్చించుకుంటున్నారు. దోమల నివారణకు ప్రభుత్వము ప్రత్యేక చర్యలు చేపట్టాలని, దోమల దాడికి సాయంత్రం రోడ్ల మీద తిరగలేకపోతున్నా మని ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. సాయంత్రం వేళలో స్మోక్ గన్‌తో గ్రామ వీధులలో ఫాగింగు చెయ్యాలని, మురికి కాలువలో ఆయిల్ బాల్స్ వేసి దోమల వృద్ధి చెందకుండా చూడాలి అని,ప్రజలు డెంగ్యూ, మలేరియా , టై ఫాయిడ్ వంటివిష జ్వరాల బారిన పడకుండా ఉన్నత అధికారులు గ్రామ పంచాయతీ అధికారులపై చర్యలు తీసుకొని దోమల నివారణకు చర్యలు తీసుకునేలాఆదేశించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

దోమల నివారణకు చర్యలకు శూన్యం

- పుల్లయ్య, పుసూలూరు గ్రామం



గ్రామాల్లో దోమలు విపరీతంగా పెరిగి పోయి, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామం లో పంచాయతీ అదికారులు, హెల్త్ సిబ్బంది, వచ్చామా వెళ్ళమా అన్నట్లుగా వ్యవ హరిస్తున్నారు తప్పా దోమల నివారణకు ఏటువంటి చర్యలు చేపట్టడం లేదు. శానిటేషన్ అస్తవ్యస్తంగా ఉంది,ఫాగింగ్ చెయ్యడం లేదు, దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు పాటించడం లేదు. అధికారులు , పాలకులు నిర్లక్ష్యమ్ వీడి దోమల నివారణ చర్యలు చెపట్టి ప్రజల ఆరోగ్యం కాపాడాలని కోరుకుంటున్నాం.

ఆరు దాటితే దోమల బాధ

- నక్క జయన్న, బిళ్లలాపురం



ఆరు దాటితే దోమల తో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. వీధులలో దోమల్ రయ్ రయ్ మంటూ ఇళ్లలోకి వచ్చేస్తున్నాయి. దోమ కాటుకు కాళ్లు చేతులు దురదలు ఎక్కుతు న్నాయి. దారిలో ద్విచక్ర వాహనాలలో వస్తుంటే గుప్పిలితో పోసినట్లు దోమలు మొహం మీద కళ్ళలో పడు తున్నాయి. ప్రజలు రోగాల బారిన పడి ప్రాణాలు కోల్పోక ముందే అధికారులు, గ్రామ సర్పంచ్ దోమల వృద్ధికి కారణమవుతున్న మురికి కాలువలను పూడిక లు తీసి పిచ్చిమొక్కలు తొలగించి శానిటేషన్ చేసి , మురికి కాలువలో ఆయిల్ బాల్స్ వేసి, బ్లీచింగ్ పౌడర్, దోమల నివారణకు పొగ ఫా గింగ్ చెసి దోమల ని యంత్రణచర్యలు చేపట్టి ప్రజల ఆరోగ్యం కాపాడాలని కోరుకుంటున్నాము.

శ్రీశైల మల్లన్నకు ధర్మకర్తల మండలి పట్టు వస్త్రాలు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు మహాశివరాత్రి సందర్భంగా జరుగు తున్న బ్రహ్మోత్సవాలలో దేవస్థానం ధర్మకర్తల మండలి శుక్రవారం పట్టు వస్త్రాలను సమర్పిం చారు. ఇందులో భాగంగా ముందుగా ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డి వారి చక్రపాణి రెడ్డి సభ్యులు మఠం విరూపాక్షేయ స్వామి, గురు మహంత్, ఉమామహేష్, ఎం విజయలక్ష్మి బి.రామేశ్వరి, ఎ. లక్ష్మీ సావిత్రమ్మ, ఓ. మధుసూదన్ రెడ్డి , సూదిశెట్టి మాధవిలత, డాక్టర్ సి కనకదుర్గ తదితరులు కలిసి పట్టు వస్త్రాలతో ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్నారు. వారికి సంప్రదాయం ప్రకారం దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు వేద పండితులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనం తరం స్వామి వారికి ఆ తర్వాత అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు.

మహాశివరాత్రికి ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్

ప్రజాశక్తి - శ్రీశైలం

భూ కైలాసంగా ప్రసిద్ధమైన శ్రీశైల పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్ పేర్కొన్నారు. ఈ నెల 18వ తేదీ మహాశివరాత్రి పర్వదిన సందర్భాన్ని పురస్కరించుకుని స్వామి వారికి నందివాహనసేవ, పాగా లంకరణ, స్వామిఅమ్మవార్ల బ్రహ్మోత్సవ కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందు కు సకల ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ తెలిపారు. భక్తులకు వేగంగా మల్లన్న దర్శనమ య్యేలా నాలుగు రకాల క్యూలైన్ల ద్వారా భక్తులకు అనుమతించి వేగంగా దర్శనం కల్పిస్తున్నామ న్నారు. 14 కంపార్టుమెంట్లలో ఉచిత దర్శన భక్తులు వేచివుండే అవకాశం కల్పించామన్నారు. పాతాళగంగ మార్గంలోని శివదీక్షా శిబిరాలలో భక్తులు ఇరుముడి సమర్పణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. శివదీక్షా శిబిరాలు, గంగాసదన్ వెనుకభాగం, టోల్ గేట్ సమీపంలోని బసవ వనం, మల్లమ్మకన్నీరు తదితర ముఖ్య కూడళి ప్రాంతాలలో భక్తులు సేద తీరేందుకు చలువ పందిర్లు ఏర్పాటు చేశామన్నారు. సాక్షిగణపతి, పార్కింగ్ ప్రదేశాలు, కల్యాణకట్ట, చండీశ్వరసదన్, అన్నదాన భవనం తదితర ఆరుబయలు ప్రదేశాలలో కూడా చలువపందిర్లు వేశామన్నారు. బ్రహ్మో త్సవాల సందర్భంగా మొత్తం 30 లక్షల లడ్డు ప్రసాదాలను కూడా సిద్ధం చేసి 15 కౌంటర్ల ద్వారా భక్తులకు అందుబాటులో ఉంచామన్నారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా రోజుకు 30 లక్షల గ్యాలన్లను మంచినీటిని సరఫరా చేయడం జరుగుతోందన్నారు. క్షేత్రపరిధిలో 400 పబ్లిక్ కుళాయిలు ఏర్పాటు చేశామన్నారు. వెంకటాపురం,నాగలూటి, పెద్దచెరువు, భీమునికొలను మెట్లమార్గం, కైలాసద్వారం, హటకేశ్వరం, సాక్షిగణపతి, మొదలైన ప్రదేశాలలో కాలినడకన వచ్చే భక్తులకు మంచినీటి వసతి కల్పించామన్నారు. యజ్ఞవాటిక, వాసవీవిహార్, జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, రింగ్ రోడ్డు, ఏపిఎస్ ఆర్టీసి, తెలంగాణా ఆర్టీసీ, కర్ణాట ఆర్టిసి బస్సులకు, ప్రైవేటు వాహనాలకు క్షేత్రపరిధిలోని 29 ఎకరాల విస్తీర్ణంలో పార్కింగ్ సౌకర్యం కల్పించామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద 30 పడకల తాత్కాలిక వైద్యశాలతో పాటు అవసరమై అన్ని ప్రాంతాలలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. పాతాళగంగలో నీటిమట్టం తగ్గుతోన్న కారణంగా భక్తులకు జల్లు స్నానాలకు ఏర్పాటు చేశామన్నారు. అలాగే మహిళలకు దుస్తులు మార్చుకునే గదులు, తాత్కాలిక టాయిలెట్లకు మరమ్మతులు చేశామన్నారు. గంగాభవాని స్నానఘట్టాలవద్ద స్నానాలు చేసేందుకు కూడా ఏర్పాట్లు చేశామన్నారు. క్షేత్రపరిధిలో 750 శాశ్వత టాయిలెట్లను భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఆలయ పుష్కరిణి వద్ద గల భ్రామరీ కళావేదిక, శివదీక్షా శిబిరాలలోని నటరాజ కళావేదిక, మాడవీధిలోని నిత్య కళారాధన వేదికలో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవాలలో మొత్తం 1200 పైగా సమాచార సూచిక బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవ సమయాలలో శివదీక్షా భక్తులకు రెండు ప్రత్యేక హాల్స్ నందు మధ్యాహ్నం, రాత్రివేళలో అన్నప్రసాద వితరణ జరుగుతోందన్నారు.

ఐసిడిఎస్ ప్రాజెక్టులలో మార్పులు

- ఇక నుండి నియోజకవర్గాల వారీగా - జిల్లాలో నంద్యాల రూరల్, కోవెలకుంట్ల ప్రాజెక్టులు కనుమరుగు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఐసిడిఎస్ ప్రాజెక్టుల పునర్వ్యవస్థీకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇకనుండి నియోజకవర్గాల వారిగా ఐసిడిఎస్ ప్రాజెక్టులు మారానున్నాయ్. పాలన సౌలభ్యం, విస్తృత సేవలు అందించాలని ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు జీవో ఎంఎస్ నంబర్ 2 ద్వారా తెలుస్తుంది. అందుకు సంబంధించిన జీవోను ఈనెల 8న విడుదల చేశారు. ప్రస్తుతం ఉన్న ఐసిడిఎస్ ప్రాజెక్టులను ఆయా నియోజకవర్గాల వారిగా ఏర్పాటు చేయబోతున్నారు. తద్వారా కొన్ని ఐసిడిఎస్ ప్రాజెక్టులు కనుమరుగవడంతో పాటు సిడిపిఓల సంఖ్యను కూడా కుదించబోతు న్నారు. ఉమ్మడి జిల్లా కర్నూలు, నంద్యాల జిల్లాలో నాలుగు ఐసిడిఎస్ ప్రాజెక్టులు కనుమరుగు కానున్నాయి. నంద్యాల జిల్లాలో 8 ప్రాజెక్టులు ఉన్నాయి. అయితే నియోజకవర్గాల వారిగా పునర్వ్య వస్థీకరించ బోతున్నడంతో నంద్యాల రూరల్, కోవెల కుంట్ల ప్రాజెక్టులను ఎత్తివేసి అంగన్వాడి కేంద్రాలను ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో ఉన్న ఐసిడిఎస్ ప్రాజెక్టులలో విలీనం చేయబోతున్నారు. నంద్యాల రూరల్‌ను నంద్యాల మున్సిపాలిటీ నంద్యాల మండలం గోస్పాడు, పాణ్యం, గడివేముల మండ లాల పరిధిలో ఉన్న 295 అంగన్వాడి కేంద్రాలను ఐసిడిఎస్ అర్బన్ ప్రాజెక్టు కిందికి తీసుకురాబోతు న్నారు. అలాగే ఆళ్లగడ్డ నగర పంచాయతీ, చాగల మర్రి, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, సిరివెళ్ల, రుద్రవ రం మండలాల పరిధిలో ఉన్న 309 అంగన్వాడి సెంటర్లను కలిపి ఒక ప్రాజెక్టుగా, బనగానపల్లె, అవుకు, కోవెలకుంట్ల, సంజామల, కొలిమిగుండ్ల మండలాల పరిధిలోని 274 అంగన్వాడి కేంద్రాలను ఒక ప్రాజెక్టు గాను, ఆత్మకూరు కింద ఆత్మకూరు నగర పంచాయతీ, శ్రీశైలం, వెలుగోడు, బండి ఆత్మకూరు, మహానంది మండలాల పరిధిలో ఉన్న 250 కేంద్రాలు కలిపి ఒక ప్రాజెక్టుగాను, నందికొట్కూరు నగర పంచాయతీ, పగిడ్యాల, జూపాడుబంగ్లా, పాములపాడు, కొత్తపల్లి, మిడు తూరు మండలాల పరిధిలో ఉన్న 285 అంగన్వాడి కేంద్రాలను ఒక ప్రాజెక్టుగా, డోన్ అర్బన్, ప్యాపిలి బేతంచెర్ల మండలాలలోని 20048 అంగన్వాడి కేంద్రాలను ఒక ప్రాజెక్టుగా ఏర్పాటు చేయబోతున్న ట్లు సమాచారం. ఇది ఎలా ఉండగా కర్నూలు జిల్లాలో కర్నూల్ అర్బన్, ఆదోని రూరల్ ప్రాజెక్టుల ను ఎతివేసి వాటిని ఇతర ప్రాజెక్టులలో కలపబోతు న్నట్లు సమాచారం. అలాగే వెల్దుర్తి, క్రిష్ణగిరి రెండు మండలాల పరిధిలో ఉన్న అంగన్వాడి కేంద్రాలను కలిపి వెల్దుర్తిలో నూతనంగా ఒక ఐసిడిఎస్ ప్రాజెక్టు ను ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. సిడిపిఓల సంఖ్యను రాష్ట్రవ్యాప్తంగా తగ్గించే ప్రయత్నం జరుగుతుందనే అనుమానాలు అర్థమవుతున్నాయి. ఉన్న సిబ్బందిపై కూడా పని భారం పెరిగే అవకాశం లేకపోలేదని వాదన వినిపిస్తోంది.



స్వామి అమ్మవార్లకు గజవాహన సేవ

ప్రజాశక్తి శ్రీశైలం



మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం నాడు స్వామి అమ్మ వాళ్లకు గజ వాహన సేవ నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో ఏడవ రోజున ఉదయం నుండి రాత్రి వరకు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం సాయ ంకాలం అక్క మహాదేవి అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు గజ వాహ నంపై ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత వివిధ కళారూపాలు నృత్య ప్రదర్శనల మధ్య ఆలయ ప్రధాన గోపురం గుండా ప్రధాన వీధుల్లోకి ప్రవేశింపజేశారు.

మరోసారి ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత గంగాధర మండపం వద్దండీ నంది గుడి వరకు నంది గుడి వద్ద నుండి బయలువీరభద్ర స్వామి వరకు ప్రత్యేక బందోబస్తు మధ్య గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. క్షేత్రంలోని భక్తులను అలరించేందుకు దేవస్థానం పలుచోట్ల సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా శివదీక్ష శిబిరాలు పుష్కరణ వద్ద కళావేదిక వద్ద సాయంత్రం 6 గంటల నుండి రాత్రి పదిన్నర గంటల వరకు సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న రెహమాన్

మంచి ఆర్థిక ప్రవర్తనే రక్ష


- ఆర్‌బిఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎం జడ్ రెహమాన్

ప్రజాశక్తి - నంద్యాల

అందరూ మంచి ఆర్థిక ప్రవర్తన కలిగి ఉండాలని అదే మీకు రక్షణ కల్పిస్తుందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎం జడ్ రెహమాన్ అన్నారు. శుక్రవారం సుజల పైప్స్ (నంది గ్రూప్ కంపెనీ) నందు జరిగిన ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలకు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రిసర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దేశవ్యాప్తంగా ఈ వారోత్సవాలలో ప్రజలను మంచి ఆర్థిక ప్రవర్తన వైపు నడిపించడానికి ఇలాంటి కార్యక్రమాలు చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సి ఎఫ్ ఎల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి ఆంజనేయలు మాట్లాడుతూ ప్రజలందరూ ఆర్థిక అక్షరాస్యత పెంచుకోవాలని ఆర్థిక ప్రణాళిక బడ్జెట్ వేసుకొని పొదుపు వైపు పయనించాలని తెలియజేశారు. మంచి ఆర్థిక ప్రవర్తనే మన భవిష్యత్తు ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతుందని అన్నారు. అలాగే డిజిటల్ బ్యాంకింగ్ సేవలు సద్వినియోగం చేసుకొని నగదు రహిత లావాదేవీలు నిర్వహించాలని తెలియజేశారు. అవగాహన లేని ఆన్లైన్ ట్రాన్సాక్షన్ ద్వారా ఆర్థిక మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకొవాల న్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా లిట్ డిస్టిక్ మేనేజర్ సత్య నారాయణ, సుజల పైప్స్ ఎండీ సుజల,సిఎఫ్ ఎల్ కౌన్సిలర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మున్సిపల్ చైర్మన్ ముందస్తు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - నందికొట్కూరు



మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి ముందస్తు పుట్టినరోజు వేడుకలు నందికొట్కూరు పట్టణంలో సి.యస్.ఐ స్కూల్ నందు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి మిత్రు లు నంద్యాల జిల్లా శాప్ కో-ఆర్డినేటర్ స్వామిదాసు రవికుమార్, పాఠ శాల విద్యా కమిటీ చైర్మన్ రవి,జయ ప్రకాష్, మాలిక్‌ల ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్ అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లా డుతూ విద్యను అభ్యసించిన పాఠశాలలో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చిన్ననాటి మిత్రులు ఖాసీం వలి, రాజశేఖర్ గౌడ్, వార్డు ఇంచార్జ్ పి.రమేష్, నరేష్ రెడ్డి, సోషల్ మీడియా కో-కన్వీనర్ బ్రహ్మయ్య పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- 20 నుండి నిరవధిక సమ్మె : సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ పట్టణ అధ్యక్ష, కార్య దర్శులు దర్శనం లక్ష్మణ్, కెఎండి మహ మ్మద్ గౌస్‌లు డిమాండ్ చేశారు. శనివారం ఆర్ఏఆర్ఎస్‌లో ఆందోళన చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆచార్య ఎన్జీరంగా ఏడిఆర్ వెంకటేశ్వర్లుకు సమర్పిం చారు. అలాగే ఈనెల సమ్మెలో వెళుతున్నట్లు స్థానిక కార్మికులతో కలిసి సమ్మె నోటీసులు ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు లేబర్ సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు విన్నవించినప్పటికీ పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. వీధి లేని పరిస్థితిలో ఈనెల 20వ తేదీ నుండి రాష్ట్ర వ్యాపితంగా కాంట్రాక్టు లేబర్ నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి కే మహమ్మద్ గౌస్, కోశాధికారి వెంకట లింగములు, ఆర్ఎఆర్‌యస్ నాయకులు అయ్యన్న, పుల్లయ్య, సుజాత, నాగేశ్వరమ్మ లతోపాటు 100 మంది కార్మికులు పాల్గొన్నారు.



వినతి పత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

డోన్‌లో గెలుపునకు కృషి చేయండి : టిడిపి



మాట్లాడుతున్న డోన్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అబ్జర్వర్ కాటమయ్య, ,నాయకులు


ప్రజాశక్తి - డోన్

డోన్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ గెలుపు కొరకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని డోన్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అబ్జర్వర్ కాటమయ్య, డోన్ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి కోరారు. శుక్రవారం డోన్ పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు ఇదేమి ఖర్మ కార్యక్రమం డోన్ నియోజకవర్గంలో డోన్ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి నాయకత్వంలో కార్యక్రమలను విజయవంతం చేస్తున్నారని,క్లస్టర్ యూనిట్ ఇన్చార్జిలను,మండల ముఖ్య నాయకులను అభినందించారు. అదేవిధంగా ఓటర్ వెరిఫికేషన్ నందు డోన్ నియోజకవర్గం ఫేజ్-1 పూర్తి చేసుకొని ఫేజ్-2 చేస్తున్నారని మరింత త్వరగా బాధ్యత తీసుకొని పూర్తి చేయాలని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి డోన్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి గెలుపు కొరకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి వలసల రామకృష్ణ, మాజీ ఎంపీపీ దేవరబండ వెంకట నారాయణ గౌడ్, డోన్ మండల టిడిపి అధ్యక్షులు సలీంద్ర శ్రీనివాసులు యాదవ్,నంద్యాల జిల్లా టిడిపి కార్య దర్శి అబ్బిరెడ్డిపల్లె గోవిందు,డోన్ మండలం టిడిపి ఉపాధ్యక్షులు మిద్దపల్లె గోవిందు, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి ఎల్ఐసి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పోతుల నాగరాజు గెలుపునకు విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-డోన్

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజును గెలిపించాలని సిఐటియు, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం డోన్ పట్టణంలో విస్తృతంగా ప్రచారం చేశారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని డోన్ పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలలో సిఐటియు, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నాగరాజు, డోన్ పట్టణ అధ్యక్ష కార్యదర్శు లు శ్రీకాంత్,శివరాం,మండల అధ్యక్షులు రామాంజనే యలు,కోశాధికారి నాగ మద్దయ్య,ఎస్ఎఫ్ఐ నంద్యాల జిల్లా కార్యదర్శి నిరంజన్ , డివైఎఫ్ఐ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మధు శేఖర్, డోన్ ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు అశోక్ మాట్లాడారు. 2023 మార్చిలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పోతుల నాగరాజుకు యుటిఎఫ్, ఎస్టియు, ఉపాధ్యాయ ఉద్యోగ, కార్మిక ప్రజా సంఘాలు జనవిజ్ఞాన వేదిక బహుజన ఉద్యోగ సంఘాలు విద్యార్థి యువజన సంఘాలు మేధావులు బలపరుస్తున్నారని వివరించారు.



ప్రచారం చేస్తున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నాగరాజు, డోన్ పట్టణ అధ్యక్ష కార్యదర్శు లు శ్రీకాంత్

డాక్టర్ పోతుల నాగరాజు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రజాజీవితంలో ఏమాత్రం సంబంధం లేకుండా కేవలం ఎన్నికల సమయంలో అధికార ప్రతిపక్ష పార్టీల అండతో ఎమ్మెల్యేలు, ఎంపీలుగా ఎన్నికవ్వడం మనం చూస్తున్నారని అన్నారు. అది ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ లాంటి పెద్దల సభ ఎన్నికలకు విస్తరించడం అన్యాయమని అన్నారు. నిరుద్యోగు లకు అండగా ఉంటూ వారి పోరాటాలకు నాయకుడిగా ముందు నిలిచిన నాగరాజు సేవలను గుర్తింతంచాలని పట్టభద్రులను కోరారు. **కొత్తపల్లి** : మార్చి 13వ తేదీన జరగనున్న పశ్చిమ రాయలసీమ పట్టుభద్రుల శాసనమండలి ఎన్నికలలో ప్రోగ్రెస్ యు డెమోక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) అభ్యర్థి పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ స్వాములు, పూర్వపు విద్యార్థి ఉద్యమ నాయకులు బొల్లు ప్రసాద్ యాదవ్, ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు సంజీవ రాయుడు, కెవిపిఎస్ జిల్లా నాయకులు ఎన్ సంపత్ ఓటర్లను కోరారు. శుక్రవారం మండలంలోని సింగరాజుపల్లి లింగాపురం కొత్తపల్లి నందికుంట తదితర గ్రామాలలో ఇంటింటికి, సచివాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల గొంతును శాసనమండలిలో వినిపిస్తున్న వారికి బలం చేకూర్చాలంటే పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఎమ్మెల్సీగా గెలిపించి శాసన మండలికి పంపించాలని కోరారు.



స్కాలర్షిప్‌లను అందచేస్తున్న సూపరిండెంట్ ఏ శ్రీనివాసరావు

విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - నంద్యాల

విద్యార్థులు వివిధ రంగాల్లో రాణించేలా తల్లిదండ్రులు అధ్యాపకులు ప్రోత్సహించాలని తపాలా సూపరిండెంట్ ఏ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం గత అక్టోబర్ నెలలో నిర్వహించిన పరీక్షల్లో స్కాలర్షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపి తపాలా సర్కిల్ తరవున గత ఏడాది అక్టోబర్‌లో 16వ తేదీన నంద్యాల తపాలా దివిజన్ వారు “దీన్ దయాళ్ స్పర్శ యోజన” అంశంపై నిర్వహించిన పరీక్షల్లో స్కాలర్‌షిప్‌లకు ఎంపికైన వారందరికీ ఆర్ఎస్ రోడ్డులోని పోస్ట్ ఆఫీస్‌లో బహుమతులను అందజేశారు. స్కాలర్ షిప్ మొత్తమును వారి పేర్ల మీద తపాలలో సేవింగ్ ఖాతాలు ప్రారంభించి ఆ సొమ్మును వారి ఖాతాలో జమ చేశారు. భవిష్యత్తులో జరగబోయే ఇటువంటి కార్యక్రమాలలో విద్యార్థులు పాల్గొనుటకు తల్లిదండ్రులు, అధ్యాపకులు ప్రోత్సాహించాలని తపాల సూపరిండెండెంట్ సూచించారు.

మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే పరామార్శ

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని క్రిష్ణగిరి గ్రామ సమీపంలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన మనోహర్ కుటుంబాన్ని ఎమ్మెల్యే కాటసానిరామిరెడ్డి పరామర్శించారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డిలు మృతదేహాన్ని చూసి వారి తల్లి,తండ్రులను, బంధువులను పరామర్శి ంచారు. మృతుడి కుటుంబానికి తన సహాకారాలు ఉంటాయని ఎమ్మెల్యే తెలిపారు. బుడగ జంగాల సంఘం నాయకులు చిన్న స్వామి,శివ,బాలుడు, తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ప్యాపిలి



రామచంద్రుడు (ఫైల్)

మండలంలోని వెంగలాంపల్లి గ్రామంలో శుక్రవారం తీవ్ర విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన రామచంద్రుడు (52) గ్రామ సమీపంలోని చెరువులోకి మరి కొందరితో కలిసి చేపల వేటకు వెళ్లారు. ప్రమాదవసాత్తు చేపల వల రామచంద్రుడి కాలికి తగిలి చెరువులో పడిపోయాడు. అక్కడ చేపలు పడుతున్న మరికొంత మంది జాలర్లు గమనించి అతనిని ఒడ్డుకి చేర్చేలోపు మృతి చెందినట్లు తెలిపారు. ఇతనికి భార్య ఇద్దరు కొడుకులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్ఐ రాకేష్ దర్యాప్తు చేస్తున్నామన్నారు.



వైద్య సేవలు అందిస్తున్న ఇఎన్‌టి నిపుణులు డాక్టర్ ఎం శ్రీకాంత్

ఉచిత వైద్య శిబిరంకు విశేష స్పందన

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రగతి చెవి, ముక్కు, గొంతు, చిన్నపిల్లల ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ప్రగతి చెవి ముక్కు గొంతు చిన్నపిల్లల ఆసుపత్రి ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం నంద్యాల పట్టణంలోని చందన బ్రదర్స్ ఆర్చి దగ్గర ఉన్న ప్రగతి చెవి ముక్కు గొంతు చిన్నపిల్లల ఆసుపత్రిలో డాక్టర్ ఎం శ్రీకాంత్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో ఎండోస్కోపీ పరీక్షలు వినికిడి పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి వినికిడి మిషన్ ను, ఆపరేషన్లను తక్కువ ధరకు చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఎండి డాక్టర్ ఎం శ్రీకాంత్ మాట్లాడుతూ చిన్నపిల్లలకు వచ్చే సీజనల్ రోగాలు, డస్ట్,వైరల్ ఫీవర్ వంటి వ్యాధులపై చికిత్స ఇవ్వడం జరుగుతుందన్నారు. చెవి, ముక్కు, గొంతు సంబంధమైన రోగాలకు చెవిలో చీము కారడం,రక్తం రావడం,చెవిలో ఎముకలు కొరకటినే దీర్ఘకాలిక వ్యాధులు,ముక్కులో గోసలు, కండలు పెరగడం, గొంతులో గురకలు రావడం,గొంతు క్యాన్సర్ వంటి రోగాలకు చికిత్స ఇవ్వడంతో పాటు పలు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ఎం ప్రగతి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటను అడ్డుకోవడం దారుణం

- టిడిపి లీగల్ సెల్ కార్యదర్శి లాయర్ బాబు

ప్రజాశక్తి - పాణ్యం

తూర్పుగోదావరి జిల్లా అనపర్తి గాంధీ చౌక్‌లో చంద్రబాబు నాయుడు బహిరంగ సభకు అనుమతి ఇచ్చి.. శుక్రవారం అనుమతి లేదని పోలీసులు అడ్డుకోవడము దారుణం అని రాష్ట్ర టిడిపి లీగల్ సెల్ కార్యదర్శి లాయర్ బాబు అన్నారు. చంద్రబాబు నాయుడు బహిరంగ సభలకు భారీ ఎత్తున తరలివస్తున్న ప్రజలను చూసి వైఎస్ఆర్ పార్టీకి భయం పట్టుకుందన్నారు. రాష్ట్రంలో పరిపాలన ఎమర్జెన్సీ లాగా కనబడుతుందన్నారు.

చిన్నకంబలూరులో పొలంబడి

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని చిన్నకంబలూరు గ్రామ పరిధిలోని పంట పొలాల్లో వ్యవసాయ అధికారి బి.జ్యోతి శుక్రవారం డాక్టర్ వైఎస్ఆర్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి అలాగే నాణ్యమైన పంటలు సాధించుకోవడం రైతుల స్వయం సహాయకారిగా చేయాలన్నదే పొలంబడి ముఖ్య ఉద్దేశమని వ్యవసాయ అధికారి రైతులకు వివరించారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా బండన్నాసం, పరిసరాల విశ్లేషణ, మొదలైన అంశాలపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా రైతులు, రైతులు వ్యవసాయ సహాయకుడు చాణక్యుడు తదితరులు పాల్గొన్నారు.

23న మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - సంజామల

సంజామల మండల సర్వసభ్య సమావేశం ఈనెల 23న ఉదయం 11 గంటలకు మండల అధ్యక్షురాలు పోచ రమాదేవి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ విజయ్ కుమార్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సమావేశంలో అన్ని శాఖలపై సమీక్ష సమావేశం ఉంటుందని, తాగునీటి సమస్య గురించి చర్చ ఉంటుందని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

ట్రాక్టర్ బోల్తా - వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మహానంది



నల్లమల్ల ఘాట్ రోడ్డు నంద్యాల-గిద్దలూరు జాతీయ రహదారి దిగువ మెట్ట సమీపంలోని మలుపు వద్ద ట్రాక్టర్ బోల్తా పడి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. మహానంది మండలం గాజులపల్లె గ్రామానికి చెందిన పి.మల్లయ్య అలియాస్ (42) నల్లమల ఘాట్ రోడ్‌లో ప్రమాదాలు జరగకుండ వల్ల పలుమార్లు దెబ్బతిన్న డిమ్మెలను పునరుద్ధరిస్తున్న పనిలో భాగంగా సిమెంట్ బస్తాలు ట్రాక్టర్లో గాజులపల్లె నుండి తరలిస్తుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి కొండ చరియలను ఢీకొని బోల్తా పడిన ఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇతను గాజులపల్లె గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్ గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి ఇద్దరు కుమారులు సంతానం. గిద్దలూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపాలి

: రేడియం నూర్

ప్రజాశక్తి - ఆత్మకూరు

చదువుతో పాటు ప్రతి ఒక్కరు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచి మంచి భవిష్యత్తు పొందాలని నూతనంగా ఎన్నుకోబడిన ఆత్మకూర్ స్పోర్ట్స్ క్లబ్ గౌరవ అధ్యక్షులు రేడియం నూర్ అన్నారు. శుక్రవారం ఆత్మకూర్ స్పోర్ట్స్ క్లబ్ సభ్యుల ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా స్థానిక చైతన్య స్కూల్ (పెద్ద కళేల) లో నూతనంగా ఆత్మకూర్ స్పోర్ట్స్ క్లబ్ కి గౌరవ అధ్యక్షుడిగా ఎన్నుకోబడిన రేడియం నూర్‌కి పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా రేడియం నూర్ మాట్లాడారు. ఆత్మకూర్ స్పోర్ట్స్ క్లబ్ డైరెక్టర్‌గా ఎస్ నూర్ బేగ్, సంయుక్త కార్యదర్శులుగా సయ్యద్ మునీర్, ఫారూఖ్, జాకీర్, కొత్త శివ కుమార్, పాస్ మహమ్మద్‌ని నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ హసీబ్ మున్నా, ఆసీఫ్ బేగ్,విధ్య కమిటీ చైర్మన్ వరాల మాలిక్,నబీ రసూల్, సలీం, ముత్తు, టాటా రఫీక్, మునీర్, పాల్గొన్నారు.

బాల అకాడమీలో అనీమియా ముక్త్ భారత్

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణంలోని బాల అకాడమీ పాఠశాలలో అనీమియా ముక్త్ భారత్ కార్యక్రమము ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐ.ఎం.ఏ.) ఆధ్వర్యంలో శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపిహెచ్ (మిషన్ పింక్ హెల్త్) చైర్మన్ నంద్యాల డాక్టర్ నాగమణి, డాక్టర్ సౌజన్య, ఎంపిహెచ్ సెక్రటరీ ఏ.పీ. డాక్టర్, అరుణ, డబ్ల్యూడబ్ల్యూడి (ఉమెన్స్ డాక్టర్ వింగ్) సభ్యురాలు డాక్టర్ సర్వధా, డాక్టర్.వసుధ డాక్టర్ మాధవీ, సెక్రటరీ నంద్యాల పాల్గొని విద్యార్థులకు అనీమియా నివారణ గురించి దిశా నిర్దేశం చేశారు. వైద్య బృందానికి బాల అకాడమీ ప్రిన్సిపల్ మాధవీ లత శాలువాలతో సన్మానించి కర్నూలు హారమాల చేసి సత్కరించారు. పాఠశాల విద్యార్థినిలు జ్ఞాపికలు ఇచ్చి గౌరవ అభివందనములు తెలియజేశారు.



మాట్లాడుతున్న బాల అకాడమీ ప్రిన్సిపల్ మాధవీ లత

యాగంటిలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రజాశక్తి-బనగానపల్లె : యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో శుక్రవారం ప్రారంభం అయ్యాయి. మండలంలోని యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలోని ప్రధానాలయం ఎదురుగా ఉన్న ధ్వజస్తంభం వద్ద స్వామివారి ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహించి ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవాలను స్వామివారి ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. ఆలయ చైర్మన్ బుచ్చిరెడ్డి, ఈవో చంద్రశేఖర్ రెడ్డిల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు మహేష్ శర్మ, కిషోర్ శర్మ, చిన్న , ఆనందశర్మల వేదమంత్రోచ్ఛరణాల మధ్య మహాన్యాస పూర్వక రుద్రాభిషేకములు, కుంకుమార్చన, సహస్రనామ మాలార్చన తదితర పూజలు నిర్వహించారు. పాలకమండలి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూర్ : శివరాత్రి పర్వదినానికి ఆత్మకూరు పట్టణంలోని పలు దేవాలయాలు విద్యుత్ అలంకరణతో శివరాత్రి పర్వదినానికి ముస్తాబయ్యాయి. మండలంలోని నల్లమల అడవుల్లో ఉన్న రుద్ర కోటేశ్వర దేవాలయం, చిన్న గుమతం సైతం పర్వదినానికి విద్యుత్ అలంకరణలు చేశారు. నల్లమల్ల అడవిలో ఉన్న రుద్ర కోటేశ్వర దేవాలయానికి ఆత్మకూరు పట్టణం నుండి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ఈ దేవాలయానికి జాగరణ కోసం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వాహనాలలో రావడానికి నిర్వాహకులు ఏర్పాట్లను చేశారు. **బేతంచర్ల :** మండలంలోని బేతంచెర్ల పట్టణం గోర్లగుట్ట శంకరాపురం యంబాయి తదితర గ్రామాలలో మహాశివరాత్రి పురస్కరించుకొని శివపార్వతుల కళ్యాణ మహోత్సవం ఘనంగా భక్తులు నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కార్యనిర్వాహక అభివృద్ధి కమిటీ సభ్యులు జగన్ శ్రీధర్ తెలిపారు.

మహాశివరాత్రికి ఏర్పాట్లు పూర్తి

- డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ప్రజాశక్తి-డోన్

మహాశివరాత్రి సందర్భంగా కొత్త బుగ్గరామలింగేశ్వర స్వామి దేవాలయం తిరుణాలకు కావల్సిన ఏర్పాట్లను పూర్తి చేశామని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. శుక్రవారం ఏర్పాట్లను చైర్మన్‌తోపాటు మున్సిపల్ వైస్ చైర్మన్లు కోట్రికే హరికిషన్, జాకీర్ హుస్సేన్, మున్సిపల్ కమిషనర్ పాల్గొన్నారు. లైటింగ్, వాటర్, సెక్యూరిటీ, క్లీనింగ్ తదితర ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని నిర్వహకులను ఆదేశించారు.



ఆర్జెడి ప్రతాపరెడ్డిని సస్పెండ్ చేయాలి : సిపిఐ



తాహసిల్దార్ కు వినతిపత్రం అందిస్తున్న సిపిఐ నాయకులు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

అధికార పార్టీ నాయకుడిగా వ్యవహరిస్తున్న ఆర్జెడి ప్రతాప్ రెడ్డిని సస్పెండ్ చేయాలని కోరుతూ ఆళ్లగడ్డ సిపిఐ నాయకులు భాస్కర్, బాలవర్ధిరాజు మండల తాహసిల్దార్ హరినాథ్ రావుకు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్జెడి ప్రతాపరెడ్డి అధికార పార్టీ నాయకుడిలా వ్యవహరిస్తూ వైసిపి అనుకూల ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు కోసం రహస్య సమావేశాలు, సభలు నిర్వహిస్తు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని, ఆర్జెడి పదవి నుంచి తొలగించి కేసు నమోదు చేయాలన్నారు. ఆదోని పట్టణంలో రహస్యంగా పదవ తరగతి పరీక్ష అవగాహన సదస్సు పేరుతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్జెడి ప్రతాపరెడ్డి చర్యను నిరసిస్తూ నిరసన వ్యక్తం చేసిన ఏఐఎస్ఎఫ్ నాయకుల పైన కేసునమోదు చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఇప్పటికైనా ప్రతాపరెడ్డిని సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. **రుద్రవరం :** అధికార పార్టీ తొత్తుగా వ్యవహరిస్తున్నటువంటి కడప ఆర్జెడి ప్రతాపరెడ్డిని సస్పెండ్ చేయాలని కోరుతూ రుద్రవరం మండలం డిప్యూటీ తాసిల్దార్‌కు ఆళ్లగడ్డ తాలూకా సిపిఐ కార్యదర్శి కొమ్ము భాస్కర్, మండల కార్యదర్శి బాల నరసింహుడు, తదితరులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు బాలవర్ధిరాజు, పుల్లయ్య, నారాయణ, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు. **బేతంచర్ల :** ఆర్జెడి బి. ప్రతాపరెడ్డిని ఎన్నికల కమిషన్ తక్షణమే సస్పెండ్ చేయాలని బేతంచెర్ల మండల సిపిఐ మండల కార్యదర్శి వై భార్గవ్, సహాయ కార్యదర్శి తాలూకా తిరుమలేష్ కోరారు. తాసిల్దార్ కార్యాలయం ముందు సిపిఐ మండల సహాయ కార్యదర్శి తాలూకా తిరుమలేష్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, అనంతరం మండల డిప్యూటీ తాసిల్దార్ సత్యదీప్‌కు వినతి పత్రం సమర్పించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్, నాయకులు భాస్కర్, విజయ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె : అధికార పార్టీ ఏజెంట్ ఆర్జెడి ప్రతాప్ రెడ్డిని తక్షణమే సస్పెండ్ చేయాలని ఏఐటియుసి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ డి శివ, బాలకృష్ణ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో శివ, బాలకృష్ణ మాట్లాడుతూ ప్రతాపరెడ్డిని తక్షణమే విధుల నుంచి తొలగించి డిస్మిస్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు జి సంజీవులు, ఏపీ జిఎస్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కలిగిరి రాముడు , మహిళా సమైక్య నాయకురాలు రామసుబ్బమ్మ పాల్గొన్నారు.

వైసిపి పాలనతో అభివృద్ధి శూన్యం : టిడిపి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అభివృద్ధి శూన్యమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనార్టీ అధ్యక్షుడు అన్వర్ ఖాన్, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి, శ్రీశైలం నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షుడు మల్లేశ్వర్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం మండలం లోని ఏ కోడూరు గ్రామంలో నిర్వహించిన ఇదేమి కర్మ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం ఏర్పడిన ఇంతవరకు రోడ్లు వేయలేదని ఉద్యోగులకు జీతాలు సక్రమంగా ఇవ్వడం లేదని, ఎలాంటి అభివృద్ధి పనులు జరగడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు వైవి సుబ్బారెడ్డి, మనోహర్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **బనగానపల్లె :** వైసిపి పాలనలో ప్రజలు విసిగి వేసారి పోయారని టిడిపి సెల్ జిల్లా అధ్యక్షులు కృష్ణ నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నరాజుపాలెం తండాలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ నాయక్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నాయకులు నరసింహులు, జయ నాయక్, నాయకులు పాల్గొన్నారు. **పగిడ్యాల :** వైసిపి పాలనతో ప్రజలు విసిగిపోయారని టిడిపి మండల కన్వీనర్ పలుచని మహేశ్వర్ రెడ్డి, టిడిపి నాయకులు మద్దిలేటి గౌడ్, మహేష్ నాయుడు విమర్శించారు. మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో వారు మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన నుంచి ధరలు విపరీతంగా పెరిగాయన్నారు.

పాణ్యంను ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేస్తా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పాణ్యం

పాణ్యం మండల కేంద్రాన్ని ఆధ్యాత్మిక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం పాణ్యం బ్రుంగీశ్వర స్వామీ దేవాలయంలో నంది విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. టిటిడి సహకారంతో గ్రామంలోని పానికేశ్వర స్వామీ,వీర నారయణ స్వామీ,బ్రుంగేస్వర స్వామీ ,కొత్తూరు సుబ్బారాయుడు స్వామీ దేవాలయాలను అన్ని రకాలుగా భక్తులు మెచ్చే విధంగా అభివృద్ధి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కరుణాకర్ రెడ్డి, చందమామ బాబు, పాలం చంద్ర శేఖర్ రెడ్డి, దేవాలయం కమిటీ సభ్యులు వన్నం బాలకృష్ణ, ఓరుగంటి జగన్,పోలురు వెంకటేశం, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను నిలదీసిన దళిత కాలనీ వాసులు

గుడి పక్కలో దాదాపుగా యాభై సెంట్లు స్థలంను అంబేద్కర్ కళ్యాణ మండపం కోసం ఏర్పాటు చేయాలని ఎస్‌సి కాలనీ కోరారు. గ్రామస్తులు చందాలు వేసుకుని ఆ స్థలం శుభ్రంగా చేసుకుంటే ఇప్పుడు ఆ స్థలం దళితులకు ఇవ్వకుండా ఆ స్థలాన్ని దేవ స్థలానికి ఇస్తాము అని అధికారులు, ప్రజాప్రతినిధులు దారుణం అన్నారు. దళితులను ఇప్పటికీ దేవస్థానంలో లోకి రానివ్వకుండా అంటరానితనం వారిలాగా చూస్తున్నందున ఎస్సీ కాలనీ ప్రజలు ఆగ్రహంతో నీలాదీశారు. వెంటనే అంబేద్కర్ కళ్యాణం మండపం ఏర్పాటుకు స్థలం ఇవ్వాలని కోరారు. వనము వెంకటాద్రి, ప్రతాప్, వనము నాగరాజు, మల్లిపొగు సుబ్బన్న, నెరవాటి సుబ్బారాయుడు, చిలకలబాలన్న తదీతరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

భూ పంపిణీ అడ్డుకోవడం దారుణం



: ఎమ్మెల్యే కాటసాని

ప్రజాశక్తి - బనగానపల్లె

మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి కొలిమిగుండ్ల మండలంలో భూ పంపిణీ అడ్డుకోవడం దారుణమని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి విమర్శించారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తన నివాసంలో విలేకరుల సమా వేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిదో విడత భూ పంపిణీలో భాగంగా అసైన్మెంట్ భూమిని పంపిణీ చేసేందుకు ఆదేశాలు జారీ చేయడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో భూమిలేని పేదలకు భూ పంపిణీలో పట్టాలు ఇచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కొలిమిగుండ్ల ,అవుకు మండలాల్లో పేదలు తమకు భూములు లేవని ఉన్న భూములను సిమెంట్ ఫ్యాక్టరీ కి అమ్ముకున్నామని పట్టాలు ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి భూ పంపిణీ జరగకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. పేదలకు మంచి చేస్తుంటే ఓర్వలేక కొలిమిగుండ్ల మండలంలో పంపిణీ జరగకుండా మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి కోర్టుకు వెళ్లి అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే కాటసాని తెలిపారు. పేద ప్రజలపై ప్రేమ ఉంటే భూ పంపిణీ జరగకుండా హైకోర్టులో వేసిన పిల్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు.

నల్లమల అడవులలో పాదాచారులకు అంధకారం

క్షేత్ర పరిధిలో పారిశుద్ధ లోపం టాయిలెట్ కు 20 రూపాయలు వసూలు వెదజల్లుతున్న దుర్వాసనలు పట్టించుకోని జిల్లా అధికారులు

ప్రజాశక్తి - శ్రీశైలం

మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలక్షేత్రంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి వాళ్లను దర్శించుకునేందుకు పాదయాత్రగా వస్తున్న యాత్రికులకు నల్లమల అడవుల లో అంధకారంలో నడక కొనసాగిస్తున్నారు. ఎంతో ప్రసిద్ధిగాంచిన శ్రీశైల క్షేత్రానికి పాదయాత్రగా ఎన్నో సంవత్సరముల నుండి భక్తులు కర్నూలు అనంతపూర్ జిల్లాల నుండి అత్యధిక సంఖ్యలో ప్రతి సంవత్సరం పాదయాత్రగా వస్తున్నారు. ప్రతి సంవత్సరం కంటే ఈ సంవత్సరం ఏర్పాట్లు అధికంగా ఉన్నప్పటికీ వెంకటాపురం బైర్లుటి నాగాలూటీ సీతమ్మ బావి తదితర ప్రాంతాల్లో ప్రభుత్వం తరపు నుండి, ప్రైవేటు సంస్థల వారు అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అయితే ఆ తర్వాత బయలుదేరిన భక్తులకు పాదయాత్రగా వస్తున్న వారికి అంధకారంలో నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వెంకటాపురం దగ్గర చిన్న చిన్న టార్చిలైట్లు కొనుక్కోవడం వాటి ద్వారా వచ్చే లైట్ ద్వారా పాదయాత్రగా చేసుకుంటూ వస్తున్నారు. చుట్టుపక్కల అంధకారం ఉండటంవల్ల ఎటు పక్క నుండి అడవిలో నుండి ఏ జంతువు వస్తుందని సుమారు 15 కిలోమీటర్ల దూరం మేర అంధకారంలో నడవవలసిన పరిస్థితి ఉంది. ఈ అంధకారంలో నడుస్తున్న యాత్రికుల కొరకు దేవస్థానం గానీ అటవీ శాఖ గానీ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం శోచనీయం అని భక్తులు అంటున్నారు. కనీసం పాదయాత్రలో నడిచే 11 రోజులు పాటునైనా కనీసం జనరేటర్ ద్వారా విద్యుత్ దీపాలను వెలిగిస్తే బాగుంటుం దని వారు తెలిపారు. మరుగుదొడ్లకు రూ.5 అయితే రూ.20 వరకు వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. ఈ విషయంపై జిల్లా అధికారులకు డివిజన్ అధికారులకు తెలిపినప్పటికీని వారు ఏమాత్రం పట్టించుకోవడంలేదని వారు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని అదేవిధంగా పారిశుద్ధం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని దుర్వాసన రాకుండా తగిన చర్యలు తీసుకో వాలని భక్తులు కోరుతున్నారు. చెత్త కుప్పలు నెత్తివేయడంలో కూడా శానిటేషన్ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



ఆర్‌జెడిపై దాడి అమానుషం

ప్రజాశక్తి - ఆత్మకూర్

కడప అర్జెడి ప్రతాప్ రెడ్డిపై దాడి చేయడం హేయమైన చర్య అని, దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు జవహర్ నాయక్ అన్నారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలో ఆయన మాట్లాడుతూ గురువారం నాడు అనంతపురం పట్టణంలోని పంగల్ రోడ్‌లో ఉన్న ఆర్డిటి అంధుల పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలతో విద్యాపరమైన అంశాలపై సమీక్ష సమావేశం ముగించుకొని అనంతరం ఆర్డీటి అతిథి గృహంలో రాత్రి బస చేశారని, ఆర్జెడిని కలవడానికి బంధువులు,మిత్రులు కొంత మంది అక్కడికి వచ్చారని,అదే సమయంలో ఐదు మంది అక్కడికి వచ్చి విద్యార్థి సంఘం నాయకులం అని చెప్పి,ఆర్జెడి ప్రతాపరెడ్డి పైన దాడికి ప్రయత్నిస్తే అక్కడే ఉన్న ప్రతాపరెడ్డి బంధువులు, మిత్రులు అడ్డుకున్నారన్నారు. ఎన్నికపరమైన అంశాలు ఉన్నదని భావిస్తే ఎన్నికల అధికారులకు, పైస్థాయి అధికారులకు ఫిర్యాదు చేయలే తప్ప భౌతిక దాడులకు పాల్పడడం హేయమైన చర్య అని, దుండగులను కఠినంగా శిక్షించాలని, ప్రతాపరెడ్డికి భద్రత కల్పించాలని ఆయన కోరారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని పెద్దవంగలి,చిన్నవంగలి గ్రామాలలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు బంగారు షరీఫ్, మౌళీబాషలు శుక్రవారం పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకున్నారు. డ్రై డే సందర్భంగా పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో మురికి కాలువలను శుభ్రపరచి, వృధా నీరు ఉన్న చోట బ్లీచింగ్, వేస్టాయిల్ చల్లించారు. గ్రామంలోని ప్రజలు వృధా నీటిని రహదారులపై వేయరాదని,పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి నాగార్జున, ఏఎన్‌ఎమ్ నూర్జహాన్, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు .

చదువుతోపాటు ఆటపాటలు అవసరం

ప్రజాశక్తి - బేతంచెర్ల

విద్యను అభ్యసించే విద్యార్థులకు విద్యతో పాటు మానసిక ఉల్లాసానికి ఆటపాటలు ఎంతో అవసరమని బేతంచెర్ల పారిశ్రామికవేత్తలు గుండా గోపాల్ శ్రీధర్ రెడ్డి అన్నారు. బేతంచర్ల మండల కేంద్రంలోని కర్నూలు రోడ్డులో గల సుమేధా ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో పాఠశాల డైరెక్టర్ విజయ నాగరాజు ఆధ్వర్యంలో సుమేధా స్కూల్ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవ సంబరాలలో స్కూల్ విద్యార్థిని విద్యార్థులు చేసిన సాంస్కృతిక నత్య కార్యక్రమాలు అందరిని ఎంతో ఆకట్టుకున్నాయి. అనంతరం పూర్వ విద్యార్థి హైదరాబాదులో నిర్వహించిన స్విమ్మింగ్ లో ఏకధాటిగా ఒక గంట 40 నిమిషాల పాటు ఏకధాటిగా స్విమ్మింగ్ చేసి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్ గ్రహీత సుధాకర్ రాజు కు సుమేధా స్కూల్ వార్షికోత్సవాల సందర్భంగా డైరెక్టర్ విజయ నాగరాజు ఎంఈఓ సోమశేఖర్ గోపాల్ తదితరులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన తాసిల్దార్ ధోని ఆల్ ఫ్రెండ్, ఎంపీడీవో సుబ్బరాజు శుక్రవారం పరిశీలించారు. మార్చి 13వ తేదీ జరుగుబోవు శాసన మండలి ఎన్నికల నిర్వహణలో మండలంలోని కొలిమిగుండ్ల జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల యందు గ్రాడ్యుయేట్స్, టీచర్స్‌లకు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, తదితర వసతుల వివరములను హెడ్మాస్టర్ సోమశేఖర్‌ను వారు అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట ఏపీవో గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

19న ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని అమ్మవారి శాలలో అవోపా, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఈనెల 19 న ఆదివారం జరగనున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని అవపా సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఏవి రామసుబ్రహ్మణ్యం సూచించారు. ఈ సందర్భంగా అమ్మవారి శాలలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ శిబిరంలో ప్రముఖ నరాల వ్యాధి నిపుణులు, కీళ్లవాతం, జనరల్ మెడిసిన్, గుండె వ్యాధి నిపుణులు, లాప్రోస్కోపిక్ సర్జన్ లు పాల్గొని రోగులకు, ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను కూడా ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. కర్నూలు నగరం ఆర్కే హాస్పిటల్ సౌజన్యంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ మేనేజర్ నదీమ్ తెలిపారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వినోద్ కుమార్, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

రాష్ట్ర స్థాయి పోటీలు ప్రారంభించిన జడ్పీ చైర్మన్

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మండలంలోని పెట్నికోట నాయన పల్లి గ్రామాల మధ్య వెలసిన గుండు మల్లేశ్వర స్వామి క్షేత్రంలో జరగబోయే శివరాత్రి మహోత్సవాలు సందర్భంగా రాష్ట్రస్థాయి బాల్ బాడ్మింటన్, కబడ్డీ పోటీలను జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి ఎర్రబోతుల ఉదయభాస్కర్ రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ అంబటి గురువిరెడ్డి, వైసిపి నాయకులు పేరం సత్యానారాయణరెడ్డి, నందిపాడు సర్పంచ్ గురివిరెడ్డి జయ నాయక్, కలవటాల తిమ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మోటార్ సైకిల్ బోల్తా

- భార్యాభర్తలకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - రుద్రవరం



మండలంలోని కోటకొండ, ఎల్లా వత్తుల గ్రామాల మధ్య శుక్రవారం మోటార్ సైకిల్ బోల్తా పడిన సంఘటనలో భార్యాభర్తలు ఇరువురు తీవ్రంగా గాయ పడ్డారు. గ్రామస్తులు వివరాల మేరకు నంద్యాలలోని రైతు నగరం గ్రామానికి చెందిన గుర్రప్ప, అతని భార్య లక్ష్మి నరసమ్మ, ఇద్దరు కలిసి ప్రతిరోజు రుద్రవరం మండలంలోని పెద్ద కంబలూరు గ్రామంలో రజక వృత్తి చేసి ఇంటికి తిరిగి వెళుతుండగా మార్గమధ్యలో మోటార్ సైకిల్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలు ఇరువురు తీవ్రంగా గాయపడడంతో వారిని 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఎస్సీ, ఎస్టీ న్యాయవాదుల కమిటీ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఎస్సీ, ఎస్టీ న్యాయవాదుల కమిటీ కార్యవర్గం ఏర్పాటు అయ్యింది. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో న్యాయవాదులందరూ చర్చ నిర్వహించి కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ప్రజా సంఘాలకు, దళిత సంఘాలకు భరోసాగా చర్చించుకుని రాబోవు రోజుల్లో సంఘటితమై పోరాడాలని నిర్ణయించారు.

ఎస్సీ,ఎస్టీ న్యాయవాదుల కమిటీ కార్యవర్గం

ఎస్సీ,ఎస్టీ న్యాయవాదుల కమిటీ కార్యవర్గం అధ్యక్షులుగా షడ్రక్, గౌరవా ధ్యక్షులుగా ప్రభాకర్, నేరెళ్ల చంద్రశేఖర్, మహిళా ప్రతినిధిగా ఓబులమ్మ, ప్రధాన కార్యదర్శిగా ప్రతాప్, జాయింట్ కార్యదర్శులుగా నేరెళ్ల మురళీ మోహన్, ఆనంద్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పాము లేటి, లత, రామకృష్ణ,స్వామినాథం, నాగేశ్వరరావు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



పోతుల నాగరాజు గెలుపునకు విస్తృత ప్రచారం

5వ పేజీ తరువాయి..

నందికొట్కూరు: ఎమ్మెల్సీగా పోతుల నాగరాజును గెలిపించాలని మండలం లోని బొల్లవరం గ్రామంలో వ్యకాసం ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. వ్యకాసం జిల్లా నాయకులు పి పకీర్ సాహెబ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ఉద్యమమే ఊపిరిగా ప్రభుత్వ ఉపాధ్యాయునిగా రాజీనామా చేసి నీతి నిజాయితీగా విలువలతో కూడిన ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నాగరాజు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వ్యకాసం మండల ఉపాధ్యక్షులు వేణుగోపాల్, కెవిపిఎస్ నాయకులు వెంకటేశ్వర్లు, విజయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు. **పాములపాడు :** పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజును గెలిపించాలని సిపిఎం, కౌలు రైతు జిల్లా ఉపాధ్యక్షులు సామన్న, రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు ఎస్ ఆర్ రమణ, మధులు కోరారు. శుక్రవారం మండలంలోని చెలిమిల్ల, లింగాల, బానుముక్కల, బానకచర్ల, వెంపెంట మద్దూరు, మిట్టకందాల, పాములపాడు గ్రామాలలోని పాఠశాలలో ఉపాధ్యాయులను సచివాలయ ఉద్యోగస్తులను వారు కలిసి ఎమ్మెల్సీ అభ్యర్థిని నాగరాజును గెలిపించాలని కోరారు. **నందికొట్కూరు :** పట్టణంలో సిఐటియు, ఏఐటీయూసీ, రైతు సంఘం, ఏఐఎస్ఎఫ్, బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి యువజన సమాఖ్య, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజు పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ పోతుల నాగరాజు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఏఐటియుసి, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు రమేష్ కుమార్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ రెడ్డి, సిఐటియు మండల కార్యదర్శి నాగన్న, టౌన్ కార్యదర్శి గోపాలకృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు పెరుగు శివకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



పురాతన బావిలో కంప చెట్లను తొలగింపు

ప్రజాశక్తి - పగిడ్యాల

మండల కేంద్రం పగిడ్యాలలోని పురాతన బావిలోని కంప చెట్లను గ్రామ పెద్దలు శుక్రవారం తొలగించారు. మహా శివరాత్రి సందర్భంగా పూర్వం శ్రీకృష్ణదేవరాయల నాటి పురాతన బావిలో ఉన్న ముళ్ళ కంప చెట్లను పిచ్చి మొక్కలను తొలగించడం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. కొన్ని వందల ఏళ్ళ నాటి ఈ బావిలోని నీరు వాడుకలో లేనందున బావి అపరిశుభ్రంగా మారిందని గ్రామస్తులు తెలిపారు. నేటి కాలంలో టెక్నలజి పెరగాడంతో చేతి పంపులు, మోటర్లు వాడకంలోకి రావడంతో ఇలాంటి పురతన బావులు అలనపాలన లేకపోవడంతో ముళ్ళ కంప చెట్లు పిచ్చి మొక్కలు పెరిగి శిథిలావస్తకు చేరుకుంటున్నాయి. బావిలోని పిచ్చి మొక్కలు, ముళ్ళ కంప చెట్లు చెత్తచెదారం జెసిబితో గ్రామస్తులు తొలగించారు.